www.vaarthavedhikasurya.com

RNI NO: TGTEL/25/A0305

# వార్త వేదిక సూర్య


తెలుగు దినపత్రిక

VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

యాదాద్రి భువనగిరి | గురువారం 06, నవంబర్ 2025 | ఎడిటర్ : పోలోజు శ్రీనివాసచారి | సంపుటి : 01 | సంచిక: 167 | పేజీలు: 08 | వెల: 5/

## బండి సంజయ్ మరో సంచలన నిర్ణయం

- ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ స్కూల్ పిల్లలకు అండ
- టెన్త్ విద్యార్థుల పరీక్ష ఫీజు చెల్లించాలని నిర్ణయం
- ఆయా జిల్లా కలెక్టర్లకు లేఖ ద్వారా వెల్లడి



**కరీంనగర్,నవంబర్5 (వార్త వేదిక సూర్య):** కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుకునే విద్యార్థులందరికీ కేంద్రమంత్రి బండి సంజయ్ శుభవార్త అందించారు. ఈ ఏడాది టెన్త్ ఎగ్జామ్ ఫీజును పూర్తిగా చెల్లించేందుకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ముందుకొచ్చారు. ఈ మేరకు ఆయా జిల్లాల కలెక్టర్లకు కేంద్ర మంత్రి లేఖ రాశారు.

మిగతా 2లో..

## బీహార్‌లో నేడు తొలిదశ పోలింగ్

- భారీగా ఏర్పాట్లు చేసిన ఎన్నికల సంఘం
- 18 జిల్లాల్లోని 121 నియోజకవర్గాల్లో తొలిదశ ఓటింగ్
- ఉదయం 7నుంచి సాయంత్రి 6 వరకు పోలింగ్



**పాట్నా,నవంబర్5(వార్త వేదిక సూర్య):** బిహార్ అసెంబ్లీ ఎన్నికల సమరం కీలక ఘట్టానికి చేరుకుంది. నేటి తొలివడత పోలింగ్‌కు ఇసి పక్కాగా ఏర్పాట్లు చేసింది. ఎన్నికల సిబ్బంది తమ సరంజామాతో కేటాయించిన పోలింగ్ కేంద్రాకు ప్రత్యేక వాహనాల్లో చేరుకున్నారు. రెండు విడతల పోలింగ్‌లో భాగంగా తొలి విడత పోలింగ్ 18 జిల్లాల్లోని 121 నియోజకవర్గాల్లో గురువారం జరుగనుంది. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమై సాయంత్రం 6 గంటలతో ముగుస్తుంది. కొన్ని నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో మాత్రం ముందస్తు జాగ్రత్తగా సాయంత్రం 5 గంటలకే పోలింగ్ ముగుస్తుంది. తొలి విడత

మిగతా 2లో..

## బీహార్‌లో ఎన్డీయే కూటమిదే విజయం

- మరోమారు ప్రజలు పట్టం కట్టబోతున్నారు
- ప్రజల్లో మార్పు గమనించానన్న మోడీ



**న్యూఢిల్లీ, నవంబర్5(వార్త వేదిక సూర్య):** బిహార్‌లో గత ఇరవై ఏళ్లలో కనీవినీ ఎరగని విజయాన్ని ఎన్డీయే కూటమి ఈసారి సాధించబోతోందని, ఓటర్లు ఆ మేరకు ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చారని ప్రధాని నరేంద్రమోదీ తెలిపారు. మరోమారు ఎన్‌డిఎదే బీహార్ అని అన్నారు. ప్రజల్లో కనిపిస్తున్న మార్పునకు ఇది సంకేతం అన్నారు. 'ఆటవిక రాజ్య' నేతలు చిత్తుచిత్తుగా ఓడిపోవడం ఖాయమని జోస్యం చెప్పారు. బిహార్లో తాను ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నప్పుడు ప్రతిచోటా మునుపటి సభ కంటే భారీగా ప్రజలు వస్తున్నారని, ముఖ్యంగా మహిళలు పెద్ద ఎత్తున పాల్గొంటున్నారని చెప్పారు. బిహార్‌లో భాజపా -ఎన్డీయే మహిళా కార్యకర్తల్ని ఉద్దేశించి మంగళవారం ఆయన నమో యాప్ ద్వారా ప్రసంగించారు. 'మేరే బూత్.. సబ్‌సే మజ్‌బూత్' అనే సంకల్పంతో భాజపా మహిళా కార్యకర్తలు అమోఘమైన కృషి చేస్తున్నారని ప్రధాని ప్రశంసించారు. బిహార్ ఎన్నికలను నేనెంతో క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాను. అందువల్ల ఎన్డీయేదే గెలుపు అని ఖాయంగా చెప్పగలను. విజయంపై నాకెలాంటి సందేహం లేదు. పోలింగ్ మాత్రం ఇంకా పెరగాలని కోరుకుంటున్నాను. మహిళల సులభతర జీవనాన్ని మెరుగుపరడానికి, వారికి సాధికారత కల్పించడానికి ఎన్డీయే సర్కారు కట్టుబడి ఉంటుందని ఆయన చెప్పారు. ఎన్డీయే విజయం కోసం బిహార్ ప్రజలు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారని చెప్పిన ఓ మహిళతో మోదీ మాట్లాడుతూ– పేదలు, దళితులు, మహా దళితులు, బీసీలు, అత్యంత వెనుకబడిన వర్గాల్లోనూ ఇదే భావన ఉందని అన్నారు.

# కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే మరింతగా అభివృద్ధి

## కాంగ్రెస్ అంటే ముస్లింలు..ముస్లింలు అంటే కాంగ్రెస్

- అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇస్తే ఎందుకు నొప్పి
- మైనార్టీల మద్దతుతోనే తాను కొడంగల్‌లో గెలిచా
- జూబ్లీహిల్స్‌లో మరోమారు సీఎం రేవంత్ ప్రచారం



**హైదరాబాద్,నవంబర్5(వార్త వేదిక సూర్య):** జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపిస్తే మరిన్ని అభివృద్ధి పనులు చేస్తాం అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలకు హామీ ఇచ్చారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో రూ.400 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నాం. నాలుగు వేల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తాం అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా షేక్‌పేట్‌లో బుధవారం సాయంత్రం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్ పాల్గొన్నారు. భారత రాష్ట్ర సమితి పేరుతో భాజపా ఓట్లు అడుగుతోందని ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి విమర్శించారు. హైదరాబాద్‌లో మూసీ రివర్ ఫ్రంట్ ఎందుకు కట్టకూడదో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇస్తే ఎందుకు బాధో చెప్పాలన్నారు. కిషన్‌రెడ్డికి సవాల్ విసిరితే ఎందుకు స్పందించడం లేదు. నిన్న నేను మాట్లాడిన మాటలను వక్రీకరించారు. మొదటి నుంచి నేను సెక్యులర్ భావాలు ఉన్న వ్యక్తిని. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు మైనార్టీలకు అనేక అవకాశాలు కల్పించింది. కొడంగల్‌లో నేను 3 సార్లు గెలవడానికి మైనార్టీల సహకారం ఉంది. 20 నెలల కాంగ్రెస్ పాలనలో మైనార్టీలకు ఇబ్బందులు లేకుండా చూశాం. అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఎలా ఇచ్చారని కిషన్‌రెడ్డి అడుగుతున్నారు. ఎందుకు ఇవ్వొద్దో.. కిషన్‌రెడ్డి చెప్పాలన్నారు.. అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇస్తే కిషన్‌రెడ్డికి ఏం ఇబ్బంది. ప్రధాని మోదీ, మాజీ సీఎం కేసీఆర్ ఒక్కటేనన్నారు. ముస్లింలను భారత రాష్ట్ర సమితి మోసం చేస్తోంది. సవాల్ విసిరి

మిగతా 2లో..

## బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాలు

- మండిపడ్డ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్



**హైదరాబాద్,నవంబర్5(వార్త వేదిక సూర్య):** జూబ్లీహిల్స్ ఉపఎన్నికల సందర్భంగా తనపై బీఆర్ఎస్ తప్పుడు ఆరోపణలు చేస్తోందని కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలు తనపై తప్పుడు నిందలు వేస్తూ, అక్రమ కేసులు పెట్టారని ఆరోపించారు. జూబ్లీ హిల్స్ ప్రజలు దొంగ సర్వేలను నమ్మరని పేర్కొన్నారు. ప్రజలకు తాను ఎల్లవేళలా అందుబాటులో ఉన్నానని, గతంలో ఓటమి చెందినా ప్రజలతో మమేకం అయ్యానని నవీన్

మిగతా 2లో..

## బిజెపిలో త్వరలోనే బిఆర్ఎస్ విలీనం

- ఈ రెండు పార్టీలు ఒక్కటే అని రుజువైంది
- గత పార్లమెంట్ ఎన్నికల్లో వీరి బంధం బట్టబయలు
- మైనార్టీలకు కాంగ్రెస్ అండగా ఉంటుందన్న సీఎం
- రేవంత్‌తో భేటీ అయిన క్రైస్తవ సంఘాల నేతలు




**హైదరాబాద్,నవంబర్5 (వార్త వేదిక సూర్య):** బీఆర్ఎస్ పార్టీని బీజేపీకి మాజీ సీఎం కేసీఆర్ తాకట్టు పెట్టారని తెలంగాణ ముఖ్యమంత్రి

మిగతా 2లో..

## రేవంత్.. బస్తీ మే సవాల్!

- నేను లై డిటెక్టర్ టెస్టుకు సిద్ధం.. రేవంత్ రెడ్డి సిద్ధమా?
- ప్లేస్, టైమ్ వాళ్లు చెప్పినా సరే.. మమ్మల్ని చెప్పమన్నా సరే
- కమాండ్ కంట్రోలా, గాంధీ భవనా, అసెంబ్లీనా? ఎక్కడైనా సిద్ధం
- బహిరంగ చర్చకు రా! రెండేండ్ల పాలన వైఫల్యాలపై తేల్చుకుందాం
- ఎవరు ఎంత అభివృద్ధి చేశారో



రేవంత్ చర్చకు రెడీనా?

- కొత్తగా ఈ రెండేళ్లలో ఒక్క రోడ్డు అయినా నిర్మించావా?
- 'సీఎం అంటే చీఫ్ మినిస్టర్.. కట్టింగ్ మినిస్టర్ కాదు'
- దమ్ముంటే ఈ ప్రభుత్వం తనను అరెస్ట్ చేయాలి
- హైదరాబాద్ అభివృద్ధిపై రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్

**హైదరాబాద్,నవంబర్5(వార్త వేదిక సూర్య):** హైదరాబాద్‌లో ఎవరు ఎంత అభివృద్ధి చేశారో దమ్ముంటే చర్చకు రావాలని సీఎం రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. జూబ్లీహిల్స్‌లో ఓడిపోతామనే రేవంత్ రెడ్డి ఫ్రస్టేషన్లో ఏదేదో మాట్లాడుతున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డికి ఆయన భాషలో ఆయనకు అర్థమైయేటట్లు చెప్పే సత్తా తమకు ఉందని అన్నారు.

కానీ రేవంత్ రెడ్డి మమ్మల్ని తిట్టినా.. మేం మాత్రం గౌరవంగానే మాట్లాడుతామని స్పష్టం చేశారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ఏం చేసిందో.. రెండేళ్లలో రేవంత్ ప్రభుత్వం ఏం చేసిందో చర్చకు సిద్ధమా అని ప్రశ్నించిన ఆయన.. దీంతో చెత్త ఎవరిది.. సత్తా ఎవరిదో తేలిపోతుందని అన్నారు.

మిగతా 2లో..

## డొనాల్డ్ ట్రంప్ పార్టీకి గట్టి షాక్

- న్యూయార్క్, వర్జీనియా మేయర్లుగా డెమోక్రాట్లు
- న్యూయార్క్ మేయర్‌గా జోహ్రాన్ మమ్దానీ
- వర్జీనియాలో లెఫ్టినెంట్ గవర్నర్‌గా గజాలా హాష్మీ
- ఇద్దరూ భారతీయ మూలాలు ఉన్న వ్యక్తులే కావడం విశేషం





**న్యూయార్క్,నవంబర్5(వార్త వేదిక సూర్య):** అమెరికాలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పార్టీకి గట్టి షాక్ తగిలింది. అగ్రరాజ్యం అమెరికాలో పలు పదవులకు జరిగిన ఎన్నికల్లో భారతతి సంతతికి చెందిన వ్యక్తులు, డెమోక్రాట్లు తమ హవా కొనసాగించారు. యూఎస్ ఆర్థిక రాజధాని న్యూయార్క్, వర్జీనియాలో జరిగిన తాజా ఎన్నికల్లో డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థులు, భారత సంతతికి చెందిన వ్యక్తులు విజయం సాధించారు.

న్యూయార్క్ మేయర్ ఎన్నికల్లో భారత సంతతికి చెందిన జోహ్రాన్ మమ్దానీ విజయం సాధించారు. ఈ ఘనత సాధించిన తొలి ముస్లిం, భారత సంతతి, ఆఫ్రికన్ సంతతికి చెందిన తొలి మేయర్‌గా ఆయన రికార్డు సృష్టించారు. 34 ఏండ్ల

మిగతా 2లో..






www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

# డొనాల్డ్ ట్రంప్ పార్టీకి గట్టి షాక్

(మొదటి పేజీ తరువాయి)

మమ్దానీ జూన్‌లో జరిగిన డెమోక్రాటిక్ ప్రైమరీ ఎన్నికల్లో ఘన విజయం సాధించి మేయర్ అభ్యర్థిగా నిలిచారు. తాజాగా జరిగిన మేయర్ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన మాజీ గవర్నర్ ఆండ్రూ క్యూమోపై మమ్దానీ విజయం సాధించారు. ఒక ఉన్నత కుటుంబం నుంచి స్వయం ప్రకటిత ప్రజాస్వామ్య సోషలిస్ట్ అయిన మమ్దానీ భారత సంతతికి చెందిన తల్లిదండ్రులకు ఉగాండాలో జన్మించాడు. ఏడేళ్ల నుంచి అమెరికాలో ఉంటున్నారు. 2018లో సహజ పౌరసత్వం పొందారు. మరోవైపు వర్జీనియా లెఫ్టినెంట్ గవర్నర్ రేసులో భారత సంతతికి చెందిన డెమోక్రటిక్ అభ్యర్థిని గజాలా హాష్మీ విజయం సాధించారు. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి జాన్ రీడ్‌పై భారీ మెజారిటీతో గెలుపొందారు. హాష్మీ 15వ సెనెటోరియల్ జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వర్జీనియా సెనెట్‌లో పనిచేసిన మొదటి ముస్లిం, తొలి దక్షిణాసియా అమెరికన్ గజాలా. ఇలా న్యూయార్క్ నగర మేయర్ పదవికి జరిగిన ఎన్నికల్లో డెమోక్రటిక్ పార్టీకి చెందిన జొహ్రాన్ మమ్‌దానీ గెలిచి చరిత్ర సృష్టించారు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎత్తులను చిత్తు చేస్తూ 34 ఏళ్ల జొహ్రాన్ మేయర్ గా విజయం సాధించారు. ఈ పదవి దక్కించుకున్న తొలి భారత-అమెరికన్ ముస్లిం ఈయనే. భారతీయ మూలాలున్న మమ్‌దానీ మరెవరో కాదు.. బాలీవుడ్ ప్రముఖ దర్శకురాలు మీరా నాయర్ కుమారుడే. జొహ్రాన్ మమ్‌దానీ 1991 అక్టోబరులో ఉగాండాలోని కంపాలాలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులిద్దరూ భారత మూలాలున్న వ్యక్తులే కావడం విశేషం. తల్లి మీరా నాయర్ పంజాబీ హిందూ మహిళ. భారత దిగ్గజ దర్శకుల్లో ఆమె ఒకరు. 'సలామ్ బాంబే', 'మాన్‌సూడ్ వెడ్డింగ్' వంటి ప్రముఖ చిత్రాలతో అంతర్జాతీయంగా గుర్తింపు పొందారు. తండ్రి మహ్మద్ మమ్‌దానీ గుజరాతీ ముస్లిం. బాంబేలో జన్మించిన మహ్మద్ మమ్‌దానీ ఆ తర్వాత ఉగాండాకు వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. ఈయన విద్యావేత్త. జొహ్రాన్ మమ్‌దానీకి ఐదేళ్ల వయసు ఉన్నప్పుడు ఆయన కుటుంబం దక్షిణాఫ్రికాలోని కేప్‌టౌన్‌కు మారింది. ఆ తర్వాత రెండేళ్లకే




న్యూయార్క్‌కు మకాం మార్చి అక్కడే స్థిరపడింది. సైన్స్, ఆఫ్రికన్ స్టడీస్‌లో జొహ్రాన్ మమ్‌దానీ గ్రాడ్యుయేషన్ పూర్తిచేశారు. జొహ్రాన్ మమ్‌దానీ రాజకీయ విజయాల వెనుక తల్లిదండ్రుల పాత్రే ఎక్కువ. ముఖ్యంగా తల్లి మీరా నాయర్ జీవితం నుంచే ఆయన ఎన్నో పాఠాలు నేర్చుకున్నారు. నాలుగు దశాబ్దాల తన సుదీర్ఘ కెరీర్‌లో ఆమె ఎన్నో ఎత్తుపల్లాలు చూశారు. సంప్రదాయ వాద, మూస సిద్ధాంతాలను సవాల్ చేస్తూ ముందుకుసాగారు. తన జీవిత అనుభవాలను ఒక్కగానొక్క కొడుకు జొహ్రాన్‌కు పాఠాలుగా చెప్పారు. 'మన కథలను తర్వాతి తరానికి మనం చెప్పకపోతే ఇంకెవరు చెబుతారు' అనేది ఆమె సిద్ధాంతం. ఆమె చెప్పిన కథలే జొహ్రాన్‌రాజకీయ ప్రయాణానికి మూలస్తంభాలుగా నిలిచాయి. అణచివేతకు గళమెత్తాల్సిందే అనే నినాదంతో జొహ్రాన్ రాజకీయాల్లోకి వచ్చారు. 2020లో తొలిసారి న్యూయార్క్ అసెంబ్లీలో అడుగుపెట్టారు. ఇప్పుడు న్యూయార్క్ నగర మేయర్‌గా విజయం సాధించి మరో చరిత్ర సృష్టించారు. మమ్‌దానీ విజయం అధ్యక్షుడు ట్రంప్ పాలనకు గట్టి ఎదురు దెబ్బగా మారింది. ఈ ఎన్నికల్లో ఆయనను అడ్డుకునేందుకు రిపబ్లికన్ నేతలు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలించ లేదు. రిపబ్లికన్ల విధానాలను తీవ్రంగా వ్యతిరేకించే మమ్‌దానీ.. తన ప్రచారంలో పదునైన విమర్శలతో ఓటర్లను ఆకట్టుకున్నారు. దీంతో ట్రంప్ స్వయంగా రంగంలోకి దిగాల్సి వచ్చింది. మమ్‌దానీ ఎన్నికల్లో గెలిస్తే న్యూయార్క్ సిటీకి ఫెడరల్ సాయం అందదని ఓ దశలో అధ్యక్షుడు హెచ్చరించారు కూడా..! యూదు వ్యతిరేకి అంటూ రిపబ్లికన్లు ఆయనపై తీవ్రస్థాయిలో ఆరోపణలు చేశారు. వాటన్నింటికి ఎదురొడ్డి నిలిచిన మమ్‌దానీ.. ఓటర్ల దృష్టిని ఆకర్షించడం పైనే ప్రధానంగా దృష్టిపెట్టారు. ఉచితాలు, హామీలతో ప్రచారం చేశారు. అవన్నీ కలిసొచ్చి మమ్‌దానీ విజయం సాధించారు.

**గజాలా హష్మి హైదరాబాద్ వాసి**

వర్జీనియా లెఫ్టినెంట్ గవర్నర్‌గా డెమోక్రాట్ గజాలా హాష్మీ విజయం సాధించారు. అమెరికా రాష్ట్రాల్లో ఈ పదవికి ఎన్నికైన తొలి ముస్లిం మహిళగా ఆమె సరికొత్త రికార్డు సృష్టించారు.



హైదరాబాద్‌కు చెందిన గజాలా నాలుగేళ్ల ప్రాయంలో తన తల్లి, సోదరుడితో కలిసి అమెరికాలోని జార్జియాకు వెళ్లారు. అంతర్జాతీయ వ్యవహారాల్లో పీహెచ్‌డీ పూర్తి చేసిన ఆమె తండ్రి ప్రసిద్ధ విశ్వవిద్యాలయంలో ఉపాధ్యాయుడిగా పనిచేసేవారు. చదువుల్లో అద్భుత ప్రతిభ కనబరుస్తూ అనేక స్కాలర్‌షిప్పులు, ప్రోత్సాహకాలు అందుకున్న గజాలా.. జార్జియా సదరన్ విశ్వవిద్యాలయంలో బీఏ ఆనర్స్ చదివారు. అట్లాంటాలోని ఎమరి వర్సిటీ నుంచి సాహిత్యంలో పీహెచ్‌డీ చేశారు. అజహర్‌తో వివాహం అనంతరం గజాలా 1991లో రిచ్‌మండ్ ప్రాంతానికి మారారు. 30 ఏళ్ల పాటు ఆమె అక్కడే రేనాల్డ్స్ కమ్యూనిటీ కళాశాలలో ప్రొఫెసర్‌గా పనిచేశారు. 2019లో ఆమె తొలిసారిగా అమెరికా ఎన్నికల్లో గెలుపొందారు. 2024లో ఆమె సెనెట్ విద్య, వైద్య కమిటీ ఛైర్‌పర్సన్‌గా డెమోక్రటిక్ పార్టీ తరఫున ఎన్నికయ్యారు.

## బిజెపిలో త్వరలోనే
# బిఆర్ఎస్ విలీనం

(మొదటి పేజీ తరువాయి)

రేవంత్‌రెడ్డి షాకింగ్ కామెంట్స్ చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులకు ఎనిమిది చోట్ల డిపాజిట్ కూడా రాకపోవడానికి కుమ్మక్కు రాజకీయాలే కారణమని విమర్శించారు. బిజెపిలో బిఆర్ఎస్ విలీనం ఎంతోదూరం లేదన్నారు. ఈ మేరకు ఈ రెండు పార్టీలు ఒక్కటే అంటూ బీఆర్ఎస్ బీజేపీ లపై రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రధామంత్రి నరేంద్రమోదీకి మద్దతు ఇస్తున్న కేసీఆర్ తెలంగాణకి అత్యంత ప్రమాదకరమని ఆక్షేపించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కారు గుర్తుకు ఓటేస్తే కమలం గుర్తుకు వేసినట్లేనని ఆరోపించారు. జూబ్లీహిల్స్ క్రైస్తవ సంఘాల ప్రతినిధులు, పాస్టర్స్ సీఎం రేవంత్‌రెడ్డిని బుధవారం కలిశారు. ఈ క్రమంలో సీఎంతో క్రైస్తవ సంఘాల ప్రతినిధులు సమావేశం అయ్యారు. ఈ నేపథ్యంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు క్రైస్తవ సంఘాల ప్రతినిధులు, పాస్టర్స్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం కోసం పనిచేస్తామని వారు హామీ ఇచ్చారు. అలాగే, తమ సమస్యలను ముఖ్యమంత్రి



దృష్టికి తీసుకొచ్చారు. వారి సమస్యలపై సానుకూలంగా సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. వారి సమస్యలని వెంటనే పరిష్కారిస్తానని మాటిచ్చారు. భారత్ జోడో పాదయాత్ర ద్వారా ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ దేశంలోని మైనార్టీలకు ఒక భరోసా ఇచ్చారని గుర్తుచేశారు. జూబ్లీహిల్స్‌లో మైనార్టీలను మభ్యపెట్టడానికి కుట్ర జరుగుతోందని ఆరోపించారు. జూబ్లీహిల్స్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేసీఆర్ ఒక వైపు ఉన్నారని.. రాహుల్ గాంధీ, తాను మరోవైపు నిలబడ్డామని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి కేసును సీబీఐకి అప్పగించి మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు కేంద్రప్రభుత్వం ఎందుకు స్పందించలేదని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నల వర్షం కురిపించారు. కార్ రేస్ కేసులో మాజీ మంత్రి కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు తెలంగాణ గవర్నర్ ఇప్పటి వరకు ఎందుకు అనుమతి ఇవ్వలేదని నిలదీశారు. బీజేపీ, బీఆర్ఎస్ మధ్య రాజకీయ ఒప్పందం లేకపోతే ఎందుకు అనుమతి ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఈ కేసుల విషయంలో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులను ఎందుకు విచారణకు పిలవడం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. బీజేపీలో బీఆర్ఎస్ విలీనం అయ్యే పరిస్థితి ఉందని ఆరోపించారు. గతంలో కవితనే ఈ విషయాన్ని స్పష్టం చేసిందని పేర్కొన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ కలిసేందుకు జూబ్లీహిల్స్‌ను ప్రయోగశాలగా చూస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ మంత్రివర్గంలో ఒక్క దళితుడే మంత్రిగా ఉన్నారని గుర్తుచేశారు. తమ మంత్రివర్గంలో నలుగురు దళితులకు అవకాశం కల్పించామని ఉద్ఘాటించారు. అసెంబ్లీ స్పీకర్‌గా గడ్డం ప్రసాద్ కుమార్‌కి అవకాశం ఇచ్చామని అన్నారు.

అత్యంత నిరుపేదలకు సంక్షేమ కార్యక్రమాలు అందించాలన్నదే తమ ప్రభుత్వ విధానమని స్పష్టం చేశారు. దేశం కోసం సర్వం త్యాగం చేసిన సోనియా గాంధీ, రాహుల్ గాంధీలని ఈడీ ఆఫీసుకు పిలిచి విచారణ చేశారని సీఎం రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. క్రైస్తవ సంఘాల ప్రతినిధులతో జరిగిన భేటీకి మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యేలు లక్ష్మీకాంతరావు, శ్రీ గణేశ్, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్,

తెలంగాణ క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ ఛైర్మన్ దీపక్ జాన్, ఏఐసీసీ మైనార్టీ విభాగం ఉపాధ్యక్షుడు అనిల్ థామస్, తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్.. బస్తీ మే సవాల్!

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్ నగర అభివృద్ధి కోసం బీఆర్ఎస్ హయాంలో చేసిన అంశాలను కేటీఆర్ ప్రస్తావించారు. హైదరాబాద్‌లో 42 ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌లు నిర్మించాం.. తమ హయాంలో స్టార్ట్ చేసినవాటికే కాంగ్రెస్ రిబ్బన్ కట్ చేసిందని వివరించారు. అవి కాకుండా.. కొత్తగా ఈ రెండేళ్లలో ఒక్క రోడ్డు అయినా నిర్మించావా అని రేవంత్ రెడ్డిని కేటీఆర్ ప్రశ్నించారు. కొత్త రోడ్ల సంగతి తర్వాత.. కనీసం రోడ్లపై పడిన గుంతలైనా పూడ్చారా అని నిలదీశారు. నగర ప్రజలకు మళ్లీ వాటర్ ట్యాంకర్లపై ఆధారపడే పరిస్థితి వచ్చిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై కాంగ్రెస్ నేతలు చర్చకు సిద్ధమా..?అని సవాల్ విసిరారు. హైదరాబాద్‌లో శానిటేషన్ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టిందే బీఆర్ఎస్ ప్రభుత్వమని కేటీఆర్ స్పష్టం చేశారు. కేసీఆర్ కూడా సీఎంగా ఒక ఏరియాను ఎంచుకొని అక్కడ శానిటేషన్ పనులు పర్యవేక్షించారని గుర్తు చేశారు.

స్వచ్ఛ్ హైదరాబాద్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టి.. వేలాది స్వచ్ఛ్ ఆటోలను ప్రవేశపెట్టామని అన్నారు. ఇప్పుడు కనీసం ఒక్క ఆటోనైనా ప్రవేశపెట్టారా అని ప్రభుత్వాన్ని కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు. తమ హయాంలో ప్రతి రోజు 7.5 మెట్రిక్ టన్నుల చెత్తను సేకరించామని వెల్లడించారు. స్వచ్ఛ్ సర్వేక్షణ్‌లో 34 అవార్డులు సాధించామని తెలిపారు.

బెస్ట్ క్వాలిటీలో నెంబర్ వన్ సిటీగా హైదరాబాద్‌కు అవార్డు వచ్చిందని చెప్పారు. తమ ప్రభుత్వం ఉన్నప్పుడే SNDP ని కూడా స్టార్ట్ చేసినట్లు తెలిపారు. పదేళ్లలో కేసీఆర్ హైదరాబాద్‌ను క్లీన్‌సిటీగా మారిస్తే.. ఇప్పుడు దాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మురికికూపంగా మార్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇక.. పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం ఒక్క హైదరాబాద్‌లో లక్ష డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించిదని గుర్తు చేశారు కేటీఆర్. ఈ రెండేళ్లలో ఒక్క ఇల్లైనా కట్టారా అని ప్రశ్నించారు. దమ్ముంటే దీనిపై చర్చకు రావాలని రేవంత్ రెడ్డికి చాలెంజ్ చేశారు కేటీఆర్.

కాంగ్రెస్ సర్కార్ ఒక్క ఇల్లు కట్టకపోగా.. వేలాది ఇళ్లను హైడ్రా పేరుతో ఈ ప్రభుత్వం కూలగొట్టిందని ఫైరయ్యారు. మరోవైపు.. హైదరాబాద్ మెట్రోను పూర్తి చేసింది కూడా తమ ప్రభుత్వమేనని కేటీఆర్ వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం మెట్రో సీఎఫ్‌వో, ఎల్ అండ్ టీ సీఎఫ్‌వోలను బెదిరిస్తోందని ఫైరయ్యారు. కాంగ్రెస్ బాధ తట్టుకోలేక, వాళ్ల బెదిరింపులకు తాళలేక ఎంత మంది పారిశ్రామికవేత్తలు పారిపోయారో చర్చకు సిద్ధమా అని నిలదీశారు.

ఇక.. కరెంటు విషయంలోనూ కాంగ్రెస్ తీరును ఎండగట్టారు కేటీఆర్. కాంగ్రెస్ హయాంలో వారానికి రెండు, మూడు రోజులు పవర్ హాలిడేస్ ఉంటే.. తాము అధికారం చేపట్టిన తర్వాత 24 గంటలు కరెంటు ఇచ్చామని గుర్తు చేశారు. ఎల్ఈడీ బల్బులతో తెలంగాణను దేదీప్యమానంగా చేశామని.. కానీ ఈ రెండేళ్లలో రేవంత్ సర్కార్ ఒక్క ఎల్ఈడీ అయినా పెట్టిందా అని ప్రశ్నించారు. ఎవరి హయాంలో విద్యుత్ వెలుగులు కొనసాగాయో.. ఎవరి హయాంలో విద్యుత్ కోతలతో ఇబ్బంది పడ్డారో చర్చిద్దామా అని సవాల్ విసిరారు కేటీఆర్.

కాంక్రీట్ జంగిల్‌లో కొత్తగా లంగ్ స్పేస్‌లు ఏర్పాటు చేసిన ఘనత తమదే అన్నారు కేటీఆర్. ప్రతి గ్రామంలో నర్సరీలు పెట్టి.. 16వేల నర్సరీలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మీ ప్రభుత్వంలో కొత్తగా ఒక్క నర్సరీ కూడా పెట్టకపోగా.. ఉన్న చెట్లను నరికేశారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అటు.. రూ.10వేల కోట్లకు కక్కుర్తిపడి %ఎజఖ%లో జీవవైవిధ్యాన్ని దెబ్బతీశారని మండిపడ్డారు. ఐటీ ఉద్యోగాలను కూడా మూడు లక్షల నుంచి 9 లక్షలకు పెంచామని గుర్తు చేశారు.

శాంతిభద్రతల విషయంలోనూ కాంగ్రెస్ పనితీరు ఏంటో బయటపెట్టారు కేటీఆర్. బీఆర్ఎస్ హయాంలో సీసీ కెమెరాలు పెట్టి కేసీఆర్ హైదరాబాద్‌లో శాంతి భద్రతలు పెంపొందిస్తే.. ఇప్పుడు సైబరాబాద్‌లో 41 శాతం, హైదరాబాద్‌లో 60 శాతం క్రైమ్ రేటు పెరిగిందని వెల్లడించారు. డే లైట్ మర్డర్లు పెరిగాయని అన్నారు. ఇదంతా ప్రభుత్వ వైఫల్యం కాదా అని కేటీఆర్ ప్రశ్నించారు. మహారాష్ట్రలోని ముంబై పోలీసులు.. హైదరాబాద్‌లోని చర్లపల్లిలో వేల కోట్ల విలువైన డ్రగ్స్ పట్టుకున్నారంటే అంతకంటే అవమానం ఉంటుందా అని అన్నారు. ఈ క్రమంలోనే సీఎం రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి కేటీఆర్ సూటిగా సవాల్ విసిరారు. దమ్ముంటే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసిందో లెక్కలు చెప్పి ఓట్ల అడగాలని చాలెంజ్ విసిరారు. దీనిపై ఎక్కడ చర్చ పెట్టినా రావడానికి తాము సిద్ధమని సవాల్ విసిరారు. చర్చించడానికి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నేతలు సిద్ధమా అని ప్రశ్నించారు. ప్లేస్, టైమ్ వాళ్లు చెప్పినా సరే.. తమను చెప్పమన్నా సరే అని అన్నారు.. కమాండ్ కంట్రోల్ సెంటరైనా.. గాంధీభవన్ అయినా.. అసెంబ్లీలో చర్చ పెట్టినా తాము ఈ విషయాలపై చర్చించడానికి రెడీగా ఉన్నామని తేల్చిచెప్పారు.


మరోవైపు.. రేవంత్ రెడ్డి, మోదీ మధ్య మంచి ఫెవికాల్ బంధం ఉందన్నారు కేటీఆర్. తెలంగాణలో కాంగ్రెస్–బీజేపీ జాయింట్ ప్రభుత్వం నడుస్తోందని తెలిపారు. సీబీఐ, ఈడీ వంటి సంస్థలను రాహుల్ గాంధీ విమర్శిస్తే.. అదే సంస్థలను రేవంత్ నమ్ముతారని వెల్లడించారు. ఇక.. మైనార్టీలను అవమానించినందుకు గాను రేవంత్ రెడ్డి తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు

. ఫార్ములా ఈ కేసులోనూ గవర్నర్ ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇచ్చినా, చార్జ్‌షీట్‌లో విషయం లేకపోవడం వల్ల దాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పక్కన పెట్టేసిందని తేల్చిచెప్పారు. తనపై చేసిన ఆరోపణల విషయంలో.. దమ్ముంటే ఈ ప్రభుత్వం తనను అరెస్ట్ చేయాలని చెప్పారు. అంతేకాకుండా.. తాను లై డిటెక్టర్ టెస్టుకు కూడా సిద్ధమే అని.. రేవంత్ రెడ్డి సిద్ధమా అని ప్రశ్నించారు. దీంతో ఎవరు దొంగనో తేలిపోతుంది కదా అని చెప్పారు. ప్రతి విషయంలోనూ పచ్చి అబద్ధాలు చెబుతున్న కాంగ్రెస్‌కు ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ నెల 11న కారు గుర్తుకు ఓటేసి మాగంటి సునీతను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# తెలుగు రాష్ట్రాల్లో కార్తీక పౌర్ణమి సందడి

- సముద్రతీరాలు, నదీతీరాల్లో పుణ్యస్నానాలు
- ఆలయాల్లో శైవరాధన.. కార్తీక దీపాల వెలిగింపు

**హైదరాబాద్/విజయవాడ,నవంబర్5 (వార్త వేదిక సూర్య):** తెలుగు రాష్ట్రాల్లో కార్తీకపౌర్ణమిని ఘనంగా జరుపుకున్నారు. వేకువ జామునే సముద్ర, నదీస్నానాలు ఆచరించారు. దగ్గరలోని ఆలయాలకు వెళ్లి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేపట్టారు. గోదావరి, కృష్ణానదుల్లో స్నానం చేయడంతోపాటు, తీరప్రాంతాల్లో ఆలయాల్లో సందడి నెల కొంది. ఇకపోతే శివాలయాలలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, దీపారాధనలు జరిగాయి. ముఖ్యంగా ఉసిరి చెట్టు కింద దీపారాధన చేసి, అరటి డొప్పలలో దీపాలు వెలిగించి నదిలో వదిలారు. భక్తులు దానధర్మాలు, నదీ స్నానాలు చేసారు. శ్రీశైలంలో కార్తీకపౌర్ణమి సందర్భంగా మల్లన్న దర్శనానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుండే పాతాళగంగలో పుణ్య స్థానాలు ఆచరించి స్వామిఅమ్మవార్ల దర్శనార్థం క్యూలైన్లలో బారులు తీరారు. స్వామిఅమ్మవార్ల దర్శనానికి 4 గంటల సమయం, ప్రత్యేక దర్శానికి 2 గంటల సమయం పట్టింది. కార్తీక పౌర్ణమి సందర్భంగా శైవక్షేత్రాలకు పోటెత్తిన భక్తులు.. ఆలయాల్లో దీపాలు వెలిగించి, పూజలు, అభిషేకాలు చేసారు. వరంగల్ వేయిస్తంభాల దేవాలయం, కాళేశ్వర ముక్తీశ్వర ఆలయం, రామప్ప దేవాలయం, కురవి వీరభద్రస్వామి, పాలకుర్తి



సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో భక్తుల రద్దీ కొనసాగింది. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు జరిగాయి. యాదాద్రి లక్ష్మీనరసింహుడి క్షేత్రంలో భక్తుల రద్దీ కనిపించింది. స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని భక్తులతో శైవ క్షేత్రాలు కిటకిటలాడాయి. శివనామస్మరణంతో శివాలయాలు మారు మోగాయి. తెల్లవారుజాము నుండే అలయాలకు చేరుకొని కార్తీక దీపాలు వెలిగించి, భక్తులు ప్రత్యేక అభిషేకాలు చేసారు. మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో కార్తీక పౌర్ణమి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. శైవ క్షేత్రాలకు పోటెత్తిన భక్తులు.. బొంతపల్లి వీరభద్ర స్వామి ఆలయంలో స్వామివారి దర్శనానికి బారులు తీరారు. బీరంగూడ భ్రమరాంబ మల్లికార్జున స్వామి, ఝూరాసంగం కేతకి సంగమేశ్వర, సంగారెడ్డి సోమేశ్వర ఆలయాల్లో భక్తుల రద్దీ నెలకొంది. కార్తీక పౌర్ణమి సందర్భంగా భద్రాచలం వద్ద గోదావరి నదిలో భక్తుల పుణ్య స్నానాలు ఆచరించారు.

కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేసారు. మణుగూరు సబ్ డివిజన్ వ్యాప్తంగా కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులతో శివాలయాలు కిటకిట లాడాయి. తెల్లవారుజాము నుంచి భక్తులు కార్తీక దీపాలు వెలిగించి, పూజలు చేస్తున్నారు. ధర్మపురి,బాసర, కాళేశ్వరంల వద్ద గోదావరి స్నానాలకు భక్తుల రద్దీ పెరిగింది. అనంతరం ఆలయాల్లో దీపారాధాన చేపట్టారు.

# బండి సంజయ్ మరో సంచలన నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)

అధికార వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో 12,292 మంది విద్యార్థినీ, విద్యార్థులు పదో తరగతి చదువుకుంటున్నారు. వీరిలో కరీంనగర్ జిల్లాలో 4,847, సిరిసిల్ల జిల్లాలో 4059, సిద్దిపేట జిల్లాలో 1118, జగిత్యాల జిల్లాలో 1135, హన్మకొండ జిల్లాలో 1133 మంది విద్యార్థులున్నారు. వీరందరికీ పరీక్ష ఫీజు చెల్లించాలంటే రూ.15 లక్షలకుపైగా ఖర్చవుతుంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులంతా దారిద్య్ర రేఖకు దిగువన ఉన్నవారే. వారిలో చాలా మంది విద్యార్థుల తల్లిదండ్రులు కూలీ పని చేసి బతికేటోళ్లు. పిల్లలకు పరీక్ష ఫీజు కూడా చెల్లించే పరిస్థితి లేదని తెలుసుకున్న బండి సంజయ్ తన నియోజకవర్గ పరిధిలోని ఆయా స్కూళ్లలో చదివే విద్యార్థుల ఫీజు మొత్తాన్ని చెల్లించాలని నిర్ణయించు కున్నారు. ఆ మొత్తాన్ని తన వేతనం నుండి చెల్లించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఆయా జిల్లాల కలెక్టర్లకు లేఖలు పంపారు. వాస్తవానికి బండి సంజయ్ కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుండి పేద విద్యార్థులకు బాసటగా నిలుస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులతోపాటు సరస్వతి శిశు మందిరాల్లో చదువుకునే విద్యార్థులుసహా దాదాపు 20 వేల మందికి 'మోదీ గిఫ్ట్' పేరుతో బ్రాండెడ్ సైకిళ్లను పంపిణీ చేశారు. అతి త్వరలోనే సర్కారీ స్కూళ్లలో 9వ తరగతి చదువుకునే విద్యార్థులకు సైతం సైకిళ్లను పంపిణీ చేస్తామని ప్రకటించారు. అట్లాగే వచ్చే ఏడాది విద్యా సంవత్సరం ఆరంభంలోనే 'మోడీ కిట్స్' పేరుతో విద్యార్థులందరికీ స్కూల్ బ్యాగ్, నోట్ బుక్స్, జామెట్రీ బాక్స్, పెన్ను, పెన్సిళ్లు, స్టీల్ వాటర్ బాటిల్‌ను పంపిణీ చేయబోతున్నారు.

# కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే మరింతగా అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

పారిపోవడం కేటీఆర్‌కు అలవాటుగా ఉంది. కేసీఆర్ పదేళ్లలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించారా అని సీఎం ప్రశ్నించారు. కాళేశ్వరం కేసులో సీబీఐ విచారణ ఎందుకు జరిపించడం లేదని రేవంత్‌రెడ్డి ప్రశ్నల వర్షం కురిపించారు. మాజీ మంత్రి కేటీఆర్ హైదరాబాద్ అభివృద్ధిపై చర్చలకు రావాలని సవాల్ విసిరారని.. ఆయనకు సవాల్ విసరడం పారిపోవడం అలవాటేనని సెటైర్లు గుప్పించారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి తాను సవాల్ విసిరితే ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌ను ఎందుకు అరెస్ట్ చేయడం లేదో ఢిల్లీలో తేల్చుకోవాలని ఛాలెంజ్ చేశారు. మూసీ రివర్ ఫ్రంట్ ఎందుకు కట్టకూడదో కిషన్‌రెడ్డి చెప్పాలని నిలదీశారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక బరిలో అసలు బీజేపీనే లేదని దెప్పిపొడిచారు. ఇక్కడ బీఆర్ఎస్ పేరుతో బీజేపీ ఓట్లు అడుగుతోందని పేర్కొన్నారు. ముస్లింలను బీఆర్ఎస్ మోసం చేస్తోందని ఆరోపించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో సెంటిమెంట్ పనికి రాదని విమర్శించారు. ఒకవేళ సెంటిమెంట్ అయితే పీజేఆర్‌పై పోటీ పెట్టింది బీఆర్ఎస్ కాదా..? అని అన్నారు. పదేళ్లుగా బీఆర్ఎస్ జూబ్లీహిల్స్‌కి ఏం ఇచ్చిందని నిలదీశారు. కాంగ్రెస్ అంటే ముస్లిం.. ముస్లిం అంటే కాంగ్రెస్ అని అభివర్ణించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌ను గెలిపిస్తే మరిన్ని అభివృద్ధి పనులు చేస్తామని ఉద్ఘాటించారు.

# బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాలు

(మొదటి పేజీ తరువాయి)

యాదవ్ మాట్లాడారు. తాను చదువుకున్న వ్యక్తినని, ప్రజల కోసం నిజాయితీగా పని చేయాలనే సంకల్పంతో రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు. గతంలో తమ గల్లీకి ఎమ్మెల్యే కూడా రాలేదని, ఇప్పుడు సీఎం వస్తున్నారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తనను కుడి భుజంగా భావించడం తమ అదృష్టమని ఆయన పేర్కొన్నారు. తన తండ్రి గతంలో కేసీఆర్‌కు సహాయం చేశారన్న నవీన్ యాదవ్, కేసీఆర్ తమ ఇంటికి వచ్చి సహాయం అడిగారని, శత్రువు ఇంటికి వచ్చినా సహాయం చేస్తామని నవీన్ యాదవ్ అన్నారు. 2018లో తనకు అవకాశం ఇవ్వకుండా బీఆర్ఎస్ అడ్డుకుందని ఆయన విమర్శించారు. తనపై వస్తున్న విమర్శలను పట్టించుకోనని, బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి ఆధారంగా ఓట్లు అడగాలని ఆయన సూచించారు.

# బీహార్‌లో నేడు తొలిదశ పోలింగ్

(మొదటి పేజీ తరువాయి)

పోలింగ్ జరుగనున్న నియోజకవర్గాల్లో అందరి దృష్టి ప్రధానంగా వైశాలి జిల్లాలోని రఘోపూర్ అసెంబ్లీ నియోజకవర్గంపై ఉంది. ఇక్కడి నుంచి ఆర్జేడీ నుంచి 'మహాగఠ్ బంధన్' ముఖ్యమంత్రి అభ్యర్థి తేజస్వి యాదవ్ పోటీ చేస్తున్నారు. రెండు సార్లు వరుసగా రఘోపూర్‌నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన ఆయన హ్యాట్రిక్ విజయం కోసం బరిలో ఉన్నారు. గతంలో ఆ నియోజకర్గానికి తేజస్వి తండ్రి లాలూప్రసాద్ యాదవ్ రెండుసార్లు, తల్లి రబ్రీదేవి మూడుసార్లు ప్రాతినిధ్యం వహించారు. ఇద్దరూ రఘోపూర్ నుంచి గెలిచే ముఖ్యమంత్రులు అయ్యారు. మహూవా నియోజకవర్గం కూడా అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. లాలూ పెద్ద కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్ కొత్తగా ఏర్పాటు చేసిన 'జన్‌శక్తి జనతా దళ్' నుంచి పోటీ చేస్తున్నారు. ఈ ఏడాది మొదట్లో ఆర్జేడీ నుంచి తేజ్ ప్రతాప్ బహిష్కరణకు గురయ్యారు. ఇటీవల జన్‌సురాజ్ కార్యకర్త దులార్ చంద్ యాదవ్ హత్యకు గురైన మొకామా నియోజకవర్గంలోనూ ఓటర్లు ఎవరికి పట్టం కడతారనే ఆసక్తి నెలకొంది. ఈ హత్య కేసులో అరెస్టయిన అనంత్ సింగ్ మొకామా నుంచి జేడీయూ టిక్కెట్‌పై పోటీలో ఉన్నారు. ఆయన తరఫున కేంద్ర మంత్రి లలన్ సింగ్ ప్రచారం చేశారు. కాగా, గురువారంనాడు పోలింగ్ జరుగనున్న తారాపూర్ నియోజకవర్గంపైనా ఆసక్తి నెలకొంది. ఇక్కడి నుంచి ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర బీజేపీ మాజీ అధ్యక్షుడు సామ్రాట్ చౌదరి పోటీలో ఉన్నారు. గురువారంనాడు పోలింగ్ జరుగనున్న తొలి విడత ఎన్నికల్లో 1,314 మంది అభ్యర్థులు తమ అదృష్టం పరీక్షించుకోనున్నారు. 3.75 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. 50,000కు పైగా పోలింగ్ స్టేషన్లను ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది. మహిళల కోసం 1,000కు పైగా ప్రత్యేక బూత్‌లు ఏర్పాటు చేసింది. ఓటర్ ఐడీ కార్డు లేకపోతే ఆధార్, పాన్, పెన్షన్ కార్డు, డ్రైవర్ లైసెన్స్ వంటి 11 పత్రాలు ఉపయోగించుకునే అవకాశాన్ని కేంద్ర ఎన్నికల సంఘం కల్పించింది. భద్రత కోసం పోలీసులు, కేంద్ర బలగాలతో కలిపి 50,000 వేల మందిని మోహరించింది. డ్రోన్లు, సీసీటీవీల పర్యవేక్షణలో పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు జరిగాయి. అసెంబ్లీ ఎన్నికల పోరు ప్రధానంగా ఎన్డీయే, ఇండియా కూటమి మధ్యనే ఉంటుందనే అంచనా ఉండగా, ప్రశాంత్ కిషోర్ జన్‌సురాజ్ పార్టీ కూడా అన్ని స్థానాల్లోనూ పోటీకి దిగింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 8 సభల్లో పాల్గొనగా, రాహుల్ 14 సభల్లో, నితీష్ 41 సభల్లో, తేజస్వి అత్యధికంగా 96 సభల్లో పాల్గొన్నారు. కాగా, రెండో విడత పోలింగ్ 122 నియోజకవర్గాల్లో నవంబర్ 11న జరుగనుంది. నవంబర్ 14న ఫలితాలు వెలువడతాయి.

# మల్టీప్లెక్సుల్లో మండుతున్న ధరలు

- ఇలా అయితే థియేటర్ల మూత తప్పదు
- హెచ్చరించిన సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ,నవంబర్5(వార్త వేదిక సూర్య):** దేశంలోసింగిల్ స్క్రీన్ థియేటర్లు బాగా తగ్గిపోయాయి. మల్టీప్లెక్సుల హవా నడుస్తోంది. అయితే, టికెట్ రేట్ల దగ్గరినుంచి తినే వస్తువుల వరకు మల్టీప్లెక్స్‌లో ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. మినిమం టికెట్ ధర 200 రూపాయలు పైనే ఉంటోంది. కొన్ని మల్టీప్లెక్స్‌లలో వాటర్ బాటిల్ ధర 100 రూపాయలు.. కాఫీ ధర 700 రూపాయలు ఉంటోంది. సాధారణ, మధ్య తరగతి కుటుంబాలు మల్టీప్లెక్స్‌లకు వెళ్లే పరిస్థితి కనిపించటం లేదు. దీన్ని దృష్టిలో పెట్టుకుని మల్టీప్లెక్స్‌లపై భారత అత్యున్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. అత్యధిక ధరలు ఇలానే కొనసాగితే సినిమా హాళ్లు మూసుకోవాల్సి వస్తుందని హెచ్చరించింది. మల్టీప్లెక్స్‌లలోని టికెట్ రేట్లు 200 రూపాయల వద్ద ఉండాలని కర్ణాటక ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనిపై మల్టీప్లెక్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియాతో పాటు మరికొంతమంది హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ప్రభుత్వ నిర్ణయంపై స్టే విధించింది. కానీ.. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా అమ్మే ప్రతీ టికెట్‌కు సంబంధించిన ఆడిటబుల్ రికార్డ్స్ మెయిన్‌టేన్ చేయాలని ఆదేశం చింది. అంతేకాదు.. ఆఫ్‌లైన్‌లో టికెట్ కొనే వారి నుంచి ఐడీ ప్రూఫ్ తీసుకోవాలని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలోనే మల్టీప్లెక్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సుప్రీంకోర్టును ఆశ్రయించింది. హైకోర్టు నిర్ణయంపై ఓ పిటిషన్ వేసింది. ఆ పిటిషన్‌పై జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహ్తా బెంచ్ తాజాగా విచారణ జరిపింది. ఇఞచారణ సందర్భంగా జస్టిస్ విక్రమ్ నాథ్ మాట్లాడుతూ.. 'మీరు వాటర్ బాటిల్‌కు 100 రూపాయలు, కాఫీకి 700 రూపాయలు తీసుకుంటున్నారు' అని అన్నారు. ఇందుకు మల్టీప్లెక్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా తరఫున కేసు వాదిస్తున్న అడ్వకేట్ ముకుల్ రోహత్గీ స్పందిస్తూ.. 'తాజ్ హోటల్‌లో కాఫీకి 1000 రూపాయలు తీసుకుంటున్నారు. మరి మీరు ఆ రేట్‌ను ఫిక్స్ చేస్తారా?' అని అడిగారు. ఇందుకు విక్రమ్ నాథ్ బదులిస్తూ.. 'ఈ రేట్లు స్థిరంగా ఉండాలి. సినిమా రంగం రోజురోజుకు దెబ్బ తింటోంది. ఇలాంటి సమయంలో జనం వచ్చి సినిమాను ఎంజాయ్ చేసేలా రేట్లు ఉండాలి. లేకపోతే సినిమా హాళ్లు ఖాళీగా ఉండాల్సి వస్తుంది' అని అన్నారు. ముకుల్ స్పందిస్తూ..'కర్ణాటక హైకోర్టు తీసుకున్న నిర్ణయం సరైనది కాదు. ఆఫ్‌లైన్‌లో టికెట్ కొనే వారి నుంచి ఐడీ ప్రూఫ్ తీసుకోమంటే ఎలా?. ఐడీ కార్డులు పెట్టుకుని థియేటర్లకు ఎవరు వస్తారు?' అని ప్రశ్నించారు.

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY










## జూబ్లీహిల్స్ ఉపఎన్నిక.. బీజేపీ ప్రచారం హోరాహోరీగా...

**రెహమాత్ నగర్‌లో దీపక్ రెడ్డికి విశేష స్పందన : గోద పాండు యాదవ్**

**మైలర్‌దేవ్‌పల్లి, నవంబర్ 05(వార్త వేదిక సూర్య):** జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉపఎన్నికల ప్రచారం రసవత్తరంగా మారుతోంది. భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి తన ప్రచార పంథాను ఉధృతం చేశారు. బుధవారం రోజున ఆయన రెహమాత్ నగర్ డివిజన్ పరిధిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.మైలార్ దేవ్ పల్లి డివిజన్ – 1 అధ్యక్షుడు గోద పాండు యాదవ్తోపాటు ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఈ ప్రచారంలో దీపక్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా, బీజేపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని, కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి లంకల దీపక్ రెడ్డిని భారీ మెజారిటీతో విజయం సాధింపజేయాలని అభ్యర్థించారు. ఈ ప్రచారానికి ప్రజల నుండి అద్భుతమైన స్పందన లభించింది. స్థానిక ప్రజలు బీజేపీ అభ్యర్థికి తమ సంపూర్ణ మద్దతును ప్రకటించారు అని అన్నారు. బీజేపీ నాయకులు ఉపఎన్నికల్లో తమ గెలుపుపై విశ్వాసం వ్యక్తం చేశారు.

## 6న వాహనాల వేలం



**చెన్నూర్,నవంబర్ 05(వార్త వేదిక సూర్య):** ఈ నెల 06న చెన్నూరు ఎక్సైజ్ కార్యాలయంలో వాహనాల వేలం నిర్వహిస్తున్నట్లు చెన్నూరు ఎక్సైజ్ సీఐ హరి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ నేరాల్లో పట్టుబడిన 6 నడిచే సామర్థ్యం గల ద్విచక్ర వాహనాలు కాగా 10 ద్విచక్ర వాహనాలు స్క్రాప్ రూపంలో మొత్తం 16 ద్విచక్ర వాహనాలను వేలం వేస్తున్నామని, వేలంలో పాల్గొనాలనే ఆసక్తి గలవారు మరిన్ని వివరాలు తెలుసుకునేందుకు స్థానిక ఎక్సైజ్ కార్యాలయాన్ని సందర్శించాలని సీఐ హరి తెలిపారు.

## భక్తిశ్రద్ధలతో ఆలయాలలో కార్తీక పౌర్ణమి ప్రత్యేక పూజలు

**మోత్కూరు: నవంబర్ 05 (వార్త వేదిక సూర్య):** కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో మహిళలు తమ గృహాలలో తులసి మొక్కలకు




బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా స్థానిక శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం, పెద్దమ్మతల్లి, శ్రీ వెంకటేశ్వర స్వామి , సాయిబాబా ఆలయాలలో మహిళలు అధిక సంఖ్యలో వేకుజామునుండే కార్తీక దీపాలు వెలిగించారు. తమ నివాస గృహాల ప్రధాన ద్వారా (గుమ్మాల) వద్ద గుమ్మడికాయలు కొట్టి దీపాలు పెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## శివయ్య నామస్మరణతో మారుమోగిన ఆలయాలు

**వలిగొండ, నవంబర్ 05(వార్త వేదిక సూర్య):** కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం వలిగొండ మండల పరిధిలోని సంగెం గ్రామం వద్ద ఉన్న భీమ లింగేశ్వర దేవస్థానం లో శివయ్యను మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల భక్తులు బుధవారం దర్శించుకున్నారు. మహిళలు పెద్ద ఎత్తున కార్తీక దీపాలు వెలిగించారు.ఉదయం లేవగానే స్థానాలను ఆచరించి



ఆలయాలకు వెళ్లారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా అర్చకులు ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో సాయంత్రం ఆరుబయట దీపాలు వెలిగించారు. అత్యంత పవిత్రమైన రోజున నియమ నిష్టతో ఉపవాసాలు ఉండి నోములు, సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. సంగె%శీ% గ్రామంలో భక్తుల కోసం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు . ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్, మాజీ ఉపసర్పంచ్ ,భక్తులు పాల్గొన్నారు.

# బీర్లకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలి

- గొల్ల కురుమ సామాజిక వర్గం బీర్ల ఐలయ్యకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలి
- నీళ్ల ఐలయ్య, ఇండ్ల ఐలయ్య,బీర్ల ఐలయ్యకు మంత్రి పదవి ఇవ్వాలి
- బీసీల ముద్దుబిడ్డ బీర్ల ఐలయ్యకు మంత్రి పదవి ఇవ్వాలి
- యువజన కాంగ్రెస్ మోటకొండూరు మండల ఉపాధ్యక్షులు జూకంటి మధు



**మోటకొండూరు, నవంబర్ 05(వార్త వేదిక సూర్య):** బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి పేదల పెన్నిధి అపార భగీరథుడు మంచి మనసున్న వ్యక్తి ఆలేరును అన్ని రంగాలలో అభివృద్ధి చేయగల దమ్మున్న నాయకుడు ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలన్నకు మంత్రి పదవి ఇవ్వాలని మోటకొండూరు మండల ఉపాధ్యక్షులు జూకంటి మధు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 40 లక్షల జనాభా ధమాష ప్రకారం ఉన్నటువంటి గొల్ల కురుమలకు మంత్రివర్గ విస్తరణ లో సముచిత స్థానం కల్పించాలన్నారు గత ప్రభుత్వాలు చూసుకుంటే తప్పకుండా గొల్ల కురుమ సామాజిక వర్గానికి మంత్రి పదవులు ఇచ్చారు అదే విధంగా మా నాయకుడు బీర్ల ఐలయ్యకు మంత్రి పదవి ఇవ్వాలి అని అన్నారు.

నీతికి, నిజాయితీకి మారుపేరైనా కురుమలు అంతే నిబద్ధతతో పనిచేస్తారన్నారు. శాసనసభఎన్నికల్లో రాష్ట్రంలోనే ఆలేరు నియోజకవర్గం నుండి సుమారు 50 వేల అత్యధిక మెజారిటీతో గెలిచిన ఏకైక కురుమ ముద్దుబిడ్డ బీర్ల ఐలన్నకు మంత్రి పదవి ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. పేదల పక్షపాతి బీర్ల అయిలన్న పేద ప్రజలకు అందుబాటులో ఉండే ప్రజా నాయకుడని, నియోజక వర్గంలోని ప్రతి గ్రామానికి వెళ్లి మార్నింగ్ వాక్ తో వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుని అక్కడికే అధికారులను పిలుచుకొని తక్షణమే సమస్యలను పరిష్కరించే నాయకుడు అన్నారు. ప్రజల సేవే ధ్యేయంగా నిరంతరం కృషి చేస్తున్న బీసీ వర్గానికి చెందిన నాయకుడికి మంత్రి పదవి ఇవ్వడం ద్వారా పార్టీ బీసీ వర్గాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని నిరూపించుకోవచ్చు" అని అన్నారు. ఆలేరు నియోజకవర్గం అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు సాగుతోందని, బీర్ల అయిలన్న సమర్థ నాయకత్వం వల్ల విద్య, వైద్యం , రోడ్లు, నీటిపారుదల అన్ని రంగాలలో విశేషమైన మార్పులు చోటు చేసుకున్నాయని, అదేవిధంగా సుమారు 100కు పైగా చెరువులను సొంత నిధులతో నింపి కష్టాలను తీర్చిన నాయకుడు అపర భగీరధుడు నీళ్ల ఐలయ్యగా తన దైన శైలిలో ముద్ర వేసుకున్నారు అదేవిధంగా రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా ఇందిరమ్మ ఇండ్లను పూర్తి చేయడంలో రాష్ట్రంలోనే 2వ స్థానంలో ఆలేరును నిలిపిన వ్యక్తి అదేవిధంగా ఆలేరుకు 1000 కోట్ల పైచిలుకు నిధులను తెచ్చి అభివృద్ధి చేస్తున్న దమ్మున్న నాయకుడు ఆలేరు ప్రజల కష్టాన్ని తీర్చగల ఒకే ఒక నాయకుడు సేవకుడు మా బీర్ల ఐలన్న ఇలాంటి వ్యక్తికి పార్టీ అధిష్టానం ఆలోచన చేసి తమ నాయకుడికి మంత్రి బాధ్యతలు అప్పగించాలని మరియు కాంగ్రెస్ పార్టీ బీసీలకు పెద్దపీట వేస్తుందని కాంగ్రెస్ పార్టీ ద్వారానే బీసీలకు న్యాయం జరుగుతుందని యువజన కాంగ్రెస్ తరఫున మనవి చేస్తున్నాం అని తెలిపారు.

# హైడ్రా కృషితో తిరిగి తెరుచుకున్న రహదారి

**కాలనీ రక్షణలో మహిళా ఐక్యత ప్రతిబింబించిన మొబైల్ టార్చ్ ర్యాలీ**

**మైలర్‌దేవ్‌పల్లి, నవంబర్ 05(వార్త వేదిక సూర్య):** శ్రీ వెంకటేశ్వర రెసిడెన్షియల్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ (రిజి. నెం. 543/2021) ఆధ్వర్యంలో బుధవారం కాలనీ వాసులు మొబైల్ టార్చ్ ర్యాలీ నిర్వహించారు. కాలనీలోని మొత్తం 13,335 చదరపు గజాల ఓపెన్ స్పేస్‌లో ఇప్పటికే 1,600 చదరపు గజాల పార్కు భూమిని హైడ్రా (హైదరాబాద్ డిసాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ ప్రొటెక్షన్ అథారిటీ) రక్షించినందుకు కాలనీ ప్రజలు గౌరవనీయ కమిషనర్ రంగనాథ్ ఐపీఎస్‌కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.




అలాగే, సుమారు 30 ఏళ్లుగా ఆక్రమణలో ఉన్న వెంకటేశ్వర కాలనీ నుండి వై.ఎస్.ఆర్. సెక్రటేరియట్ కాలనీని కలిపే 60 అడుగుల హైటెన్షన్ రోడ్డును ప్రజలకు తిరిగి అందుబాటులోకి తీసుకురావడంలో హైడ్రా తీసుకున్న చర్యలను కాలనీ వాసులు ప్రత్యేకంగా అభినందించారు.

ఈ రహదారి పునరుద్ధరణతో కాలనీల మధ్య రాకపోకలు సులభమవడంతో పాటు ప్రజలకు అత్యంత కీలకమైన కనెక్టివిటీ తిరిగి లభించింది. ఈ ర్యాలీకి సంఘ అధ్యక్షులు బొమ్మ ఉపేందర్‌నాథ్ రెడ్డి గారు నాయకత్వం వహించగా, సామాన్య కార్యదర్శి ఇషాక్, శివశంకర్, లక్ష్మణ, చంద్రమౌళి, విశ్వనాథ్ రెడ్డి, నర్సింహా రెడ్డి, కోటేశ్వరరావు, చందు, శేషు, జగదీశ్, నితీష్, ఫయిజ్ ఇబ్రాహీం, వై.ఎస్.ఆర్. కాలనీ అధ్యక్షుడు నాగరాజు, సుబ్బారావు, మహిళా సభ్యులు సుజాత, సీతాక, ప్రత్యూష, రాజీ, లావణ్య, మాధురి, ప్రిజాత, సుప్రియా, జ్ఞానేశ్వరి పాల్గొన్నారు.

# కుమ్మరుల మండల కమిటీ ఎన్నిక

**కుమ్మరి వృత్తిదారుల అభ్యున్నతికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేశం డిమాండ్**

**ఆత్మకూరు (ఎం), నవంబర్ 05 (వార్త వేదిక సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలం తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం ఆధ్వర్యంలో ఆత్మకూరు మండల కేంద్రంలో కుమ్మరి సంఘం మహాసభ నిర్వహించారు. ఈ సర్వసభ్య సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు నడికూడి జయంతి రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్కాజిగిరి దయానంద్, రాష్ట్ర కోశాధికారి ఆమంచి రాజలింగం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏడుకొండల వెంకటేశం నాయకత్వంలో , యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు ఓరుగంటి గోపాల్ ,ప్రధాన కార్యదర్శి దరిపల్లి ప్రవీణ్ కుమార్, కోశాధికారి తాదూరు ఆంజనేయులు, సూచనలతో యాదాద్రి భువనగిరి జిల్లా సలహాదారుడు పోరండ్ల లింగయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా స్థాయిలో గ్రామ, మండల కమిటీల ఏర్పాట్లు పూర్తి చేయడంతో పాటు జిల్లా కార్యవర్గ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆత్మకూరు మండలంలోని 23 గ్రామాల నుంచి కుమ్మరి కులస్తులు పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేశారు. గ్రామ కమిటీలకు, మండల కమిటీలకు సన్మానాలు నిర్వహించి సభ్యులను అభినందించారు. ఆత్మకూరు మండల అధ్యక్షునిగా కొత్తపల్లి గోవర్ధన్, ప్రధాన కార్యదర్శిగా నరుకుడుబిందెల అంజయ్య, కోశాధికారిగా ఎనగందుల నగేష్, గౌరవ అధ్యక్షులుగా మారుపాక మల్లేష్, గౌరవ సలహాదారులగా



నరుకుడు బిందెల సైదులు, వృత్తిదారుల విభాగం పోరండ్ల సత్తయ్య మారుపాక అంజయ్య, యువత విభాగం అధ్యక్షులు గర్షకోట నవీన్ కుమార్‌లను 23 గ్రామాల అధ్యక్ష కార్య దర్శులఆమోదంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏడుకొండల వెంకటేశం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాలలో ఉన్న కుమ్మరి వృత్తిదారులు ప్రభుత్వం నుండి సరైన ప్రోత్సాహం పొందేలా చర్యలు తీసుకోవాలి. ప్రతి జిల్లాలో కనీసం రెండు ఎకరాల భూమిని కేటా యించి, మట్టి పాత్రల తయారీకి అవసరమైన ఆధునిక పరికరాలు, సాంకేతిక సహాయం, శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయాలి అని డిమాండ్ చేశారు. అలాగే 50 సంవత్సరాలు దాటిన కుమ్మర వృత్తి దారులకు వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయాలని, గ్రామ దేవతల వద్ద సేవలు అందిస్తున్న కుమ్మరులను పూజారులుగా గుర్తించి వారికి ఎండోమెంట్ దేవాలయాల తరుపున తగిన పారితోషికం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు ఓరుగంటి గోపాల్, ప్రధాన కార్యదర్శి దరిపల్లి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ కుమ్మరి కులాన్ని బీసీ–బీ విభాగం నుండి బీసీ–ఏ విభాగంలోకి మార్చాలని, అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 14 లక్షల కుమ్మరి జనాభాకు నామినేటెడ్ పోస్టులు,రాజకీయ హక్కులు కల్పించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా,మండల, గ్రామ స్థాయి నాయకులు,పెద్ద సంఖ్యలో కుమ్మరి సంఘం సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయ వంతం చేశారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా అసోసియేట్ అధ్యక్షులు తాడూరి వెంకటేశం, ఉపాధ్యక్షులు గంగాధర పరమేష్, దేవరుప్పల మల్లేష్ కార్యదర్శి ఎనగందుల నాగరాజు, సహాయ కార్యదర్శి బొడ్డుపల్లి సైదులు, లీగల్ సెల్ తాడూరి బాలమల్లయ్య, మీడియా విభాగం గంగదారి శ్రవణ్, రాజకీయ విభాగం మారుపాక బిక్షపతి, తుర్కపల్లి అధ్యక్షుడు దేవరుప్పల ఐలయ్య, ఆలేరు అధ్యక్షుడు గంగాదారి సుధీర్, ఆయుర్వేదిక్ డాక్టర్ ఆరూరి బాలనరసయ్య 23 గ్రామాల కుమ్మర్లు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఉద్యోగాలు, పరిశోధనలకు పెద్దపీట

**విజ్ఞాన్స్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్**

**భూదాన్ పోచంపల్లి నవంబర్ 5 (వార్త వేదిక సూర్య):** యువతకు అత్యున్నత ఉద్యోగాలు కల్పించడం, వారిని గొప్ప పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా చేయడం, పరిశోధనలకు పెద్దపీట వేయడంలాంటి సమున్నత లక్ష్యాలతో తాము ముందుకెళుతున్నామని విజ్ఞాన్స్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ తెలిపారు. బుధవారం భూదాన్ పోచంపల్లి మండలం దేశ్ ముఖి గ్రామ పరిధిలోని విజ్ఞాన్ యూనివర్సిటీ 2026–27 సంవత్సరానికి సంబంధించి బీటెక్, బీఫార్మసీ, బీబీఏ, బీసీఏ, బీఎస్సీ, బీఏ ఎల్ఎల్‌బీ (హానర్స్), బీబీఏ ఎల్ఎల్‌బీ (హానర్స్), బీఎస్సీ (హానర్స్) అగ్రికల్చర్, ఫార్మ్–డీ అడ్మిషన్ల వీశాట్ – 2026–27 నోటిఫికేషన్‌ను ఆయన విడుదల చేశారు.




ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము బీటెక్‌లో అగ్రికల్చర్, బయోటెక్నాలజీ, బయోఇన్ఫర్మాటిక్స్, బయోమెడికల్, కెమికల్, సివిల్, సీఎస్ఈతో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ, కంప్యూటర్ సైన్స్ అండ్ బిజినెస్ సిస్టమ్స్, డేటాసైన్స్, ఐవోటీ, ఈసీఈ, ఈసీఈ–వీఎల్ఎస్ఐ, ఈఈఈ, ఫుడ్ టెక్నాలజీ, ఐటీ, మెకానికల్, రోబోటిక్స్ అండ్ ఆటోమేషన్, టెక్స్‌టైల్ టెక్నాలజీ, బీఫార్మసీ, ఫార్మా–డీ, ఎం.ఫార్మసీ, బీఎస్సీ (హానర్స్) అగ్రికల్చర్, డిప్లొమా (సీఎస్ఈ. ఈసీఈ, మెకానికల్,ఈఈఈ) కోర్సులను అందజేస్తున్నామని చెప్పారు. వీటితో పాటు బీఎస్సీ ( సైకాలజీ), బీఎస్సీ (డేటా సైన్స్), బీఎస్సీ ( మ్యాథ్స్, స్టాటిస్టిక్స్, కంప్యూటర్స్), బీఎస్సీ ( ఆక్చూరియల్ సైన్స్), బీబీఏ, బీసీఏ, బీఏ (ఎల్ఎల్‌బీ), బీబీఏ (ఎల్ఎల్‌బీ), ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, ఎంఏ ఇంగ్లీష్, ఎమ్మెస్సీ డేటాసైన్స్, ఎమ్మెస్సీ సైకాలజీ, పీహెచ్‌డీ కోర్సులను కూడా అందజేస్తున్నామని చెప్పారు. బీటెక్, బీఫార్మసీ, ఫార్మ్–డీ కోర్సులలో ప్రవేశాలకు తాము దేశవ్యాప్తంగా చేపట్టనున్న వీశాట్ ప్రవేశ పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా స్కాలర్‌షిప్‌లు పొందే అవకాశం కలదన్నారు.

### హైదరాబాద్ ఆఫ్ క్యాంపస్‌లో విభిన్న కోర్సులు

గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్స్ యూని వర్సిటీకు అనుబంధంగా ప్రారంభించిన విజ్ఞాన్స్ యూనివర్సిటీ హైదరాబాద్ ఆఫ్ క్యాంపస్‌లో విద్యార్థులకు విభిన్న కోర్సులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. గుంటూరు బ్రాంచ్ వర్సిటీలో ఉండే బీటెక్ కోర్సులతో పాటు బీకామ్, బీఎస్సీ ( సైకాలజీ), ఎమ్మెస్సీ ( సైకాలజీ), ఎమ్మెస్సీ ( ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ), ఎంటెక్, పీహెచ్‌డీ ( సీఎస్ఈ, ఈసీఈ, మేనేజ్‌మెంట్, కెమిస్ట్రీ, ఫిజిక్స్, బయోటెక్నాలజీ, ఫార్మసీ) కోర్సులు అందజేస్తున్నామని పేర్కొన్నారు.


విద్యార్థులు యూనివర్సిటీ వెబ్‌సైట్ (https://admissions. vignan.ac.in/) ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మార్చి 1 నుంచి ఏప్రిల్ 15 తేదీ వరకు ప్రవేశ పరీక్ష, ఆంధ్రప్రదేశ్, తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాల్లోనూ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తా మన్నారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్స్ యూనివర్సిటీ ఇంచార్జి రిజిస్ట్రార్ డాక్టర్ దిరిశాల విజయరాము, డీన్ అడ్మిషన్స్ డాక్టర్ కేవీ క్రిష్ణకిషోర్, డైరెక్టర్ అడ్మిషన్స్, డిప్యూటీ రిజిస్ట్రార్ ఏ. గౌరిశంకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

### రైతులకు ఎలాంటి నిబంధనలు కొర్రీలు లేకుండా

# పత్తి కొనుగోలు చేయాలి



**బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం**



**రామన్నపేట,నవంబర్ 05(వార్త వేదిక సూర్య):** రామన్నపేట మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి పత్తి పంట సాగు చేస్తే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పత్తి రైతులను చాలా ఇబ్బందులకు గురిచేస్తున్నాయి .పకృతి వాతావరణం సహకరించక నెల రోజుల నుండి ఎడతెరిపిలేని వర్షాలకు రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇప్పటికే పత్తి సాగుకు పెట్టుబడి పెరిగి కూలీలు దొరకక నిండా మునిగిన రైతులకుతాజాగా ప్రభుత్వాలు తీసుకొచ్చిన కొత్త నిబంధనలతో స్లాట్ విధానంలో పత్తి అమ్మకానికి ముందే స్లాట్ బుక్ చేసుకోవడం ఓటీపీ సమస్యలు ఒక ఎకరంకు 7 ఏడు క్వింటాళ్ల పత్తి దిగుబడిని మాత్రమే కొనుగోలు చేస్తామని తేమశాతం 8 నుండి 12 శాతం వరకు ఉంటే మాత్రమే దిగుబడి చేసుకుంటామని పత్తి కేంద్రం వద్ద అధికారులు చెప్పుతుండడంతో తేమ శాతం ఎక్కువ రావడం వల్ల పత్తి కొనుగోలు చేయడం లేదు. ఏమి చేయాలో అర్థం కాక రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో దళారుల వద్ద తక్కువ ధరలకు క్వింటాకు5000 నుండి6000 అమ్ముకొని రైతులు తీవ్రంగా నష్టపోవడం జరుగుతుంది.

రైతులుగత సంవత్సరం మాదిరిగానే రైతులకు ఎకరంకు 12 క్వింటాళ్ల పత్తిని సిసిఐ కొనుగోలు చేయాలని తేమ శాతం ఎక్కువగా ఉన్న కొనుగోలు చేయాలని పత్తి అమ్మకానికి స్లాట్ విధానాన్ని రద్దు చేసి రైతు ఇష్టమున్న కాటన్ మిల్లు వద్ద పత్తి అమ్ముకోవడానికి అవకాశం కల్పియాలని ఈ సంవత్సరం తీసుకొచ్చిన కొత్త నిబంధనలను వెంటనే ఎత్తివేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

# సిపిఐ 100 సం. ముగింపు బహిరంగ సభను జయప్రదం చేయండి

**సిపిఐ జిల్లా కార్యదర్శి దామోదర్ రెడ్డి**



**మోత్కూరు,నవంబర్ 05(వార్త వేదిక సూర్య):** డిసెంబర్ 26న ఖమ్మం జిల్లా కేంద్రంలో భారత కమ్యూనిస్టు పార్టీ( సిపిఐ) వంద సంవత్సరాల భారత స్థాయి ముగింపు ఉత్సవాలను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి పిలుపునిచ్చారు.

సిపిఐ కార్యాలయం (కె.ఆర్ భవన్)లో బుధవారం నాడు పెండెం వెంకటేశ్వర్లు అధ్యక్షతనజరిగిన సిపిఐ మోత్కూరు మండల కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా దామోదర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 1925 డిసెంబర్ 26న ఆవిర్భవించి, భారత గడ్డపై 100 ఏళ్ళు పూర్తి చేసుకుంటుందని వెట్టి చాకిరి విముక్తి కోసం కార్మికులను కర్షకులను పెట్టుబడుదారుల వ్యవస్థనుండి విముక్తి కల్పించడానికి నాటి నుండి నేటి వరకు రాజీలేని పోరాటాలు నిర్వహించిన ఘనత సిపిఐ పార్టీకి దక్కిందన్నారు. భూమికోసం భుక్తి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం నిరంకుశ నిజాం లను గద్దె దింపేందుకు జరిగిన మహోత్తరమైన తెలంగాణ సాయుధ పోరాటంలో నాలుగున్నర వేల మంది ప్రాణాలు త్యాగం చేసిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీకి మాత్రమే ఉందని తెలిపారు.

పేద ప్రజల కోసం దున్నేవాడికే భూమి కావాలని 10 లక్షల ఎకరాల భూమి భూస్వాముల నుండి గుంజి పేద ప్రజలకు పంచి పెట్టిన ఘన చరిత్ర సిపిఐ పార్టీదే నని గుర్తు చేశారు.

పోరాటాలతో దేశంలో పెట్టుబడుదారులనుండి కార్మిక శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా అనేక అనేక పోరాటాలు నిర్వహించి కార్మిక సంక్షేమ చట్టాలను సాధించిన పార్టీ సిపిఐ అని పేర్కొన్నారు. పేద ప్రజల కోసం నిరంతరం పోరాటాలు నిర్వహించి సిపిఐ పార్టీ 100 సంవత్సరాల ముగింపు సభను డిసెంబర్ 26న ఖమ్మం జిల్లా కేంద్రంలో జరిగే బహిరంగ సభలో లక్షలాది మంది పాల్గొని బహిరంగ సభను విజయవంతం చేయాలని దామోదర్ రెడ్డి కోరారు మోత్కూరు మండల కార్యదర్శి అన్నేపు వెంకట్ మాట్లాడుతూ సిపిఐ 100 సంవత్సరాల ముగింపు సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న బస్సు జాత ఈనెల 21న మోత్కూరుకు వస్తుందని ఈ బస్సుజాతకు మోత్కూరు మండలంలో ఉన్న సిపిఐ నాయకులు ,ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఈజాతకు స్వాగతం పలకాలని కోరారు. ఈ కార్యక్రమంలో గీతా పనివారల సంఘం జిల్లా అధ్యక్షులు చాపల అంజయ్య, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు బుషిపాక నర్సింహ్మ, సిపిఐ మండల సహాయ కార్యదర్శి పులకరపు మల్లేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి జిట్టా రాములు, మోత్కూరు పట్టణ కార్యదర్శి బోయిని ఉప్పలయ్య ,పొడి చేడు కొండగడప పాలడుగు దత్తప్పగూడెం ముషీపట్ల బుజిలా పురం సధర్మపురం, దాచారం పాటిమట్ల గ్రామ శాఖ కార్యదర్శులు ఎర్రబాబు, దొండ ఎల్లయ్య ,చేతరాశి సత్తయ్య, తొంట తిరు పతయ్య, ఎండి అబ్బాస్ అలీ, వల్లపు ఆంతయ్య, కొమ్ము రాములు, గొలుసుల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.




### ఆకాల వర్షాలతో నష్టపోయిన

# రైతులను ఆదుకోవాలి



**మోత్కూరు,నవంబర్ 05(వార్త వేదిక సూర్య):** ఇటీవల ఆకాల వర్షాలతో నష్ట పోయిన వరి ,పత్తి రైతులను ప్రభుత్వం వెంటనే గుర్తించి పంట నష్టం చెల్లించాలని వినియోగ దారుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి పోచం సోమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు బుధవారం నాడు ఆయన మోత్కూరులో విలేకరు లతో మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్లో రైతులు రైతులు కౌలు భూములు తీసుకొని అప్పులు తెచ్చి వరి, పత్తి పంటలు వేసి పంట చేతికొచ్చే ముందు అకాల వర్షాలతో వరి పంట నీట మునగడం ఆరబెట్టిన ధాన్యం తడిచి మొలకెత్తిన వరి పంటల వల్ల తీవ్ర నష్టం కలిగించిదన్నారు. మరి కొంతమంది వరి పంటలు కోతలు కోయడానికి మిగిలిపోయి పంట రైతులు తీవ్ర నష్టాలల్లో ఉన్నారని ఆయా రైతులతో పాటు పత్తి పంట వేసిన రైతులు కూడా వరుసగా ఆకాల వర్షాలతో పత్తి పంట జాలుపట్టి మొక్కలు ధ్వంసం కావడం, .పత్తి వర్షానికి తడిచి పోవడం వల్ల తీవ్ర నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా ఆకాల వర్షాలతో నష్టపోయిన రైతులందరికీ ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకోవాలని కోరారు.

# నేరాల నివారణపై అవగాహన

**మోత్కూరు,నవంబర్ 05(వార్త వేదిక సూర్య):** మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని కొత్త (ఆర్టీసీ) బస్టాండ్ ఆవరణంలో స్థానిక పోలీసులు బుధవారం నాడు నేరాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ



సందర్భంగా ఎస్.హెచ్.ఓ. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వాట్సప్ గ్రూప్ లో పీఎం కిసాన్ లింక్ లు వస్తే ఓపెన్ చేయవద్దన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు తమ మొబైల్ నెంబర్ కు చేసి బ్యాంక్ లో ఆధార్ లింక్ లేవని మీ మొబైల్ నెంబర్లకు ఓటిపి వస్తుందని , ఆ ఓటీపీ తమకు చెప్పాలని ఫోన్ చేస్తే ఎవరు చెప్పవద్దని ,పొరపాటున ఓటిపి నెంబర్ చెప్పినట్లయితే తమ బ్యాంక్ బ్యాలెన్స్ పోతుందని అటువంటి కాల్స్ పై తస్మాత్ జాగ్రత్తగా ఉండాలని కోరారు. గుర్తు తెలియని వ్యక్తులు తమకు సంచారిస్తే డయల్ 100 కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# బైక్ దగ్ధం

**భూదాన్ పోచంపల్లి, నవంబర్ 5 (వార్త వేదిక సూర్య):** మండలంలోని జూలూరు గ్రామానికి చెందిన దుర్గం మౌనిక ఇంటి ముందు మంగళవారం రాత్రి యాక్టివా బండిని పార్కింగ్ చేసింది. బుధవారం ఉదయం



లేచి చూసేసరికి తన బండి పూర్తిగా తగలబడి ఉంది. బాధితులు ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్ఐ కంచర్ల భాస్కర్ రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



# కార్తీక పౌర్ణమి వేడుకలు

**జల దీపోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించిన తడక లతా వెంకటేష్**

**భూదాన్ పోచంపల్లి, నవంబర్ 5 (వార్త వేదిక సూర్య):** మండలంలో పలు దేవాలయాల్లో కార్తీక పౌర్ణమి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మార్కండేశ్వర స్వామి, లక్ష్మీనారాయణ స్వామి, కనుముకుల పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి, ఇంద్రియాలలో రాజ గోపాల స్వామి, దేశ్ ముఖి సాయి బృందావనం లో కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని యజ్ఞం, సత్యనారాయణ స్వామి సామూహిక వ్రతం, సహస్ర దీపోత్సవం , కార్తీక పౌర్ణమి జల దీపోత్సవం , అన్న ప్రసాద వితరణ, ప్రత్యేక



పూజ కార్యక్రమాలు జరిగాయి. స్థానిక లక్ష్మీనారాయణ స్వామి దేవాలయంలో రాష్ట్ర చేనేత నాయకులు తడక లతా వెంకటేష్ జల దీపోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి లక్కీ డ్రా లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పోచంపల్లి బ్యాంక్ చైర్మన్ తడక రమేష్, దేవాలయ చైర్మన్ లు అంకం వినోద్, కోట పుష్పలత మల్లారెడ్డి , సీత సత్యనారాయణ,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, భారత లవ కుమార్, చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు అంకం పాండు, నాయకులు కొయ్యడ శ్రీనివాస్ గౌడ్, అంకం మురళి, గునిగంటి రమేష్, మోటే మహేష్, భజన మండలి అధ్యక్షుడు అంకం గోవర్ధన్, ఉపాధ్యక్షుడు జోగు ఉమా మహేష్, ప్రధాన కార్యదర్శి పాపని నారాయణ, సహాయ కార్యదర్శి బోడ మధు, కోశాధికారి అంకం బాలాజీ, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### జాతీయస్థాయి షూటింగ్ బాల్‌లో


# యాదాద్రి జిల్లా విద్యార్థులు ప్రతిభ



**మోత్కూరు, నవంబర్ 05(వార్త వేదిక సూర్య):** మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండల కేంద్రంలోని రాష్ట్ర జూనియర్ కళాశాల విద్యార్థులకు ఇటీవల నిర్వహించిన అండర్ 19 షూటింగ్ బాల్ క్రీడోత్సవాలలో యాదాద్రి జిల్లా బాల బాలికల జట్టు విజయ సాధన సాధించిందని రాష్ట్ర షూటింగ్ బాగోల్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు మోత్కూరు యాదయ్య తెలిపారు. బుధవారం ఆయన మోత్కూరు లో విలేకరులతో మాట్లాడుతూ ఉత్తర ప్రదేశ్ లోని ఘజియాబాద్ లో 44వ జాతీయస్థాయి పోటీలకు యాదాద్రి జిల్లాకు చెందిన క్రీడాకారులు తెలంగాణ రాష్ట్ర స్థాయి కెప్టెన్ గా బాను, సాయి, గణేష్ లు వ్యవహరించనున్నారని చెప్పారు.అదేవిధంగా ఆలేరు సాంఘిక సంక్షేమ పాఠశాల క్రీడాకారులు బి. వసంత, జె.లహరి లు చక్కటి ప్రతిభ ను కనబర్చారని... 44వ జాతీయ స్థాయి షూటింగ్ బాల్ క్రీడోత్సవాలు ఈ నెలలో ఉత్తర ప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో జరగనున్న పోటీలకు ఎంపికైనట్లు యాదయ్య , జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి మానస లు తెలిపారు.

## కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని పెద్దమ్మతల్లి ఆలయంలో 518 దీపాలతో శివలింగం అలంకరణ

**మోత్కూరు,నవంబర్ 05(వార్త వేదిక సూర్య):** మోత్కూరు మున్సిపాలిటీ కేంద్రంలోని పెద్దమ్మ తల్లి దేవాలయంలో కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని మంగళవారం ఆవుపేడతో తయారుచేసిన శివలింగానికి బుధవారం ఉదయం 5: 18 నిమిషాలకు 518 దీపాలతో 518 బిల్వపత్రాలతో శివలింగానికి భక్తులు పూజ చేశారు. ఈ కార్యక్రమానికి అర్చకులు పారునంది లక్ష్మణమూర్తి శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజ కార్యక్రమంలో పద్మశాలి సంఘం చేనేత విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు పోచం కన్నయ్య ,పద్మశాలి సంఘం రాష్ట్ర జనరల్ సెక్రెటరీ గుండు ప్రసాద్, మెట్టు మంగేష్ దంపతులు, పాదం కిరణ్ కుమార్ ,దంపతులు డాక్టర్ నామా నర్సింహ్మా రావు దంపతులు పట్టురి శివ, బంధారపు శేఖర్ దంపతులు, బైరు యాక స్వామి దంపతులు,



ముదిరాజ్ సంఘం నాయకులు సత్యనారాయణ తదితర భక్తులు పాల్గొన్నారు పూజా కార్యక్రమం తదనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

# గర్షకోట నవీన్ కుమార్ కుమ్మర్ల యువజన విభాగం అధ్యక్షులుగా ఎన్నిక

**ఆత్మకూరు (ఎం),నవంబర్ 05 (వార్త వేదిక సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలపల్లెర్ల గ్రామానికి చెందిన గర్షకోట నవీన్ కుమార్ కుమ్మర్ల యువజన విభాగం అధ్యక్షులుగా ఎన్నికైయ్యారు. అనంతరం ఆయన



మాట్లాడుతూ.. ఈ ఎన్నికకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు నడీకుడి జయంతి రావు, దయానంద్, రాజాలిగం,ఏడుకొండలు, గోపాల్, ప్రవీణ్, ఆంజనేయులు, వెంకటేష్, పరమేష్,బలమల్లయ్య,మల్లేష్, సైదులు, సుధీర్, తదితరులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# టేకులసోమారం చెరువు వద్ద కట్టమైసమ్మకు పూజలు



**వలిగొండ, నవంబర్ 5( వార్తా వేదిక సూర్య):** బునాది కాలువ ద్వారా వచ్చే నీళ్లు కరివేనుకుంట చెరువు నిండి, నల్లచెరువు అలుగు పోస్తున్న సందర్భంగా కాంగ్రెస్ పార్టి నాయ కులు పార్టీ చేగూరి మల్లేశం ,గ్రామ పెద్దలు, చెరువును పరిశీలించారు. అనంతరం కట్ట మైసమ్మకి కొబ్బరికాయ కొట్టి చెరువు గంగమ్మ కి హారతి ఇచ్చి పూలు వేసి పూజ నిర్వహించారు.
ఈ సందర్భంగా రైతులు అందరూ కలిసి చేగూరి మల్లేశంని శాలువతో సత్కరించారు. రైతులు మాట్లాడుతూ బునాదిగాని కాలువ చేగూరి మల్లేశం సొంత డబ్బులతో ఈ కాల్వను తవ్వించడం వలన చెరువు నిండి అలుగు పోస్తుంది అని చేగూరి మల్లేశంకి రైతుల ప్రక్షాళ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు,, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు మల్లేషన్న యువ సేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




# విద్యార్థులకు గొడుగులు పంపిణీ

నల్లగొండ, నవంబర్ 5 (వార్తా వేదిక సూర్య):
చందంపల్లి గ్రామంలో మండల పరిషత్ ప్రాథమికొన్నత పాఠశాల 50 మంది విద్యార్థిని విద్యార్థులకు మలిదశ తెలంగాణా ఉద్యమ నేత ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర నాయకులు యార శ్రీను, లలితలకు ప్రథమ పుత్రుడు జన్మించిన శుభ సందర్భంలో ఈ సంవత్సరంలో వర్షాలు అధికంగా కురుస్తుండడంతో పాఠశాలకు వెళ్ళిరావడానికి వర్షంలో తడుస్తూ, ఇబ్బందులు పడుతున్న విద్యార్థులను గుర్తించి గొడుగులను




పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రాథనోపాద్యుయులు కనుకుంట్ల నావిన్ రెడ్డి, వి బాలాజీ, ఆదిత్య, శ్రీహరి,తల్లి దండ్రులు,అంగన్వాడీ టీచర్ రమణ గ్రామ పెద్దలు వెంకన్న, సురేష్,గుత్తి, క్రాంతి, మాల్సుర్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయి

# తైక్వాండో 2024-25 పోటీలు

నల్లగొండ, నవంబర్ 5 (వార్తా వేదిక సూర్య):
నల్గొండ పట్టణంలో ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయి టైక్వాండో క్రీడా పోటీలను బుధవారం విన్నర్స్ వరల్డ్ స్పోర్ట్స్ అకాడమీ లో టైక్వాండో నల్గొండ జిల్లా సెక్రెటరీ యూనస్ కమాల్,, నల్గొండ జిల్లా కోశాధికారి అంబటి ప్రణీత్ లు క్రీడా పోటీలను





ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఉమ్మడి నల్గొండ జిల్లా తైక్వాండో క్రీడాకారుల జిల్లాస్థాయిలో ఎంపికైన వారిని హైదరాబాద్ సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో నవంబర్ 9న రాష్ట్రస్థాయి తైక్వాండో క్రీడల్లో పాల్గొంటారని తెలిపారు క్రీడాకారులను ప్రోత్సహించి దేశానికి మంచి పేరు తెచ్చే విధంగా క్రీడాకారులను తయారు చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎండి అవాయిస్, ఈసీ మెంబర్ నసీరుద్దీన్ క్రీడాకారులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ గారు పట్టించుకోండి మా గోడు

నల్లగొండ , నవంబర్ 5 (వార్తా వేదిక సూర్య):
నల్లగొండ మున్సిపాలిటీ, జిల్లా విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, పట్టించుకోవడం లేదని 11 వ వార్డు అర్బన్ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం





చేస్తున్నారు. 11 వ వార్డు అర్బన్ కాలనీ లో పిచ్చి మొక్కలు స్తంభం పైకి చేరి లైటు వెలుతురు రాకుండా కమ్మేసాయి, కరెంటు షార్ట్ సర్క్యూట్ అయ్యే ప్రమాదం ఉంది. వెంటనే పిచ్చి మొక్కలు తొలగించాలి అని కాలనీ వాసులు కోరుతున్నారు.

# కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి సంస్మరణ సభలను జయప్రదం చేయండి

**- సీపీఐ (ఎం-ఎల్) న్యూడెమొక్రసీ**

నల్లగొండ, నవంబర్ 5 (వార్తా వేదిక సూర్య):
భారత విప్లవోద్యమ అగ్ర నాయకులు, ప్రతిఘటన పోరాట నిర్మాత కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి 41వ వర్ధంతి సభను నవంబర్ 8న నకిరేకల్ పట్టణంలోని కామ్రేడ్ యానాల మల్లారెడ్డి స్మారక భవన్లో, నవంబర్ 9న నల్లగొండ శ్రామిక భవన్ లో నిర్వహిస్తున్నామని, ఈ సభకు విప్లవ శ్రేణులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని సీపీఐ (ఎం-ఎల్) న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి సాగర్, అఖిల భారత రైతు-కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అంబటి చిరంజీవి పిలుపు నిచ్చారు. శాలిగౌరారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సీపీ రెడ్డి సభ కరపత్రాలు ఆవిష్కరణ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ...మార్క్సిజం-లేనినిజం- మావో ఆలోచన విధానం వెలుగులో పీడిత ప్రజల విముక్తి కొరకు భారత విప్లవోద్యమ నిర్మాణ క్రమంలో కామ్రేడ్స్ చంద్ర పుల్లారెడ్డి, చారు మంజుందర్, సత్యనారాయణ సింగ్, దేవులపల్లి వెంకటేశ్వర్ రావు, తరిమెల నాగిరెడ్డి, కొల్లా వెంకయ్య, బత్తుల వెంకటేశ్వర్ రావు, చాగంటి, పొట్ల రామనర్సయ్య,జేసీఎస్, శ్రీపాద, మారోజు, రంగవల్లి, మధుసూదన్, విక్రమ్, ధర్మన్న, ఎల్లన్న, దొరన్న, బాటన్న,రవన్న, లింగన్న లాంటి అనేకమంది అమరులయ్యారని,నాటి వీర తెలంగాణ సాయుధ పోరాటం మొదలుకొని నగ్జల్బరీ, శ్రీకాకుళం,గోదావరిలోయ ప్రతిఘటన పోరాటాలకు వారధిగా, నాయకులుగా అన్నిరకాల అండదండలందించి విప్లవాల ఖిల్లాగా పేరుగాంచిన నల్లగొండ జిల్లాలో కామ్రేడ్ యానాల మల్లారెడ్డి, చంద్రారెడ్డి, వక్కవంతుల సూర్యం, మొదలు పలస బిక్షం, బూరుగు అంజన్న, జన్ను సార్, గడ్డం అమృతరెడ్డి, పిడమర్తి వెంకన్న, యానాల వీరారెడ్డి, కాకి లక్ష్మారెడ్డి, అలుగుబెల్లి, నల్లా జగదీశ్, వీసాల గోవింద్, ఏనుగుల మోహన్ లతో పాటు ఊరూరా దజండ్ల కొద్ది అమరులయ్యారని అన్నారు. వీరంతా తమకోసం కాకుండా పేద ప్రజల కోసం పోరాడినారని, దోపిడీ, పీడన, అసమానతలు రద్దుకావాలని కోరుకున్నారని, హిమాలయ



ఔన్నత్యాన్ని కప్పుకొని త్యాగాల సాళ్ళలో వేడి నేత్తురునూ చిందించారని, సామ్యవాదా పూదొటలో పరిమళాలు వెదజల్లిన వాళ్ళని అన్నారు. మృత్యువంటే క్రూరమైనదని తెలిసి కూడా పోరాటంలోకి ఊరికి విప్లవ చైతన్యాన్ని ప్రదర్శించినవారని తెలిపారు. సారా వ్యతిరేక పోరాటం, జీతగాండ్ల సమ్మె, కూలీ రెట్ల పెంపుకోసం ప్రజలను కార్యోన్ముకులను చేసినవాళ్లు, భూస్వాములకు, దొరలకు, దోపిడీ దారుల ఆగడాలకు చరమగీతం పాడినోళ్లని, దేశంలో కొనసాగుతున్న అర్ధ వలస-అర్ధ భూస్వామ్య దోపిడీ వ్యవస్థను కూకటి వేళ్ళతో సహ కూల్చివేయకుండా ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలు పరిష్కారం కావని భావించి ప్రజా విముక్తి కై పోరాడిన సీపీరెడ్డితో పాటు వేలాది మంది అమరులైన వారిని స్మరించు కోవడంలో భాగంగా నవంబర్ 8న నకిరేకల్ లో, నవంబర్ 9న నల్లగొండ లో సభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సభకు విప్లవ శ్రేణులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎం-ఎల్)న్యూడెమొక్రసీ నాయకులు మామిడోజు వెంకటేశ్వర్లు, యానాల సత్తిరెడ్డి, సిలివేరు జానయ్య, వేముల శంకర్,అంబటి నర్సయ్య, అనిల్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# డివైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

గట్టుప్పల.నవంబర్5.వార్త వేదిక సూర్య:
గట్టుప్పల మండల కేంద్రంలో, తేరేటిపల్లి గ్రామంలో భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) 46వ ఆవిర్భావ దినోత్సవలు ఘనంగా నిర్వహించారు మండల అధ్యక్షులు టేకుమట్ల కృష్ణ, తెరట్టుపల్లి గ్రామ కార్యదర్శి మలిగే శివ జెండావిష్కరణ చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డివైఎఫ్ఐ జిల్లా సహాయక కార్యదర్శి కట్ట లింగస్వామి హాజరై మాట్లాడుతూ 1980వ సంవత్సరంలో ఏర్పడినటువంటి డివైఎఫ్ఐ యువజన సంఘం నిరంతరం అందరికీవిద్య, అందరికీఉపాధి కొరకై , నిరుద్యోగ సమస్యల మీద నిరంతరం పని చేస్తుందని ఆయన కొనియాడారు, భారతదేశంలోనే కోటి సభ్యత్వం తోటి యువజన సమస్యల మీద పనిచేస్తున్న సంఘంగా అగ్రభాగాన నిలబడిందని గుర్తు చేశారు.భారత దేశ స్వాతంత్రం కోసం అతి చిన్న వయసులో ఉరి కంబాన్ని ముద్దాడిన భగత్ సింగ్ ఆశయాలతోటి, భగత్ సింగ్ కలలుగన్న నవభారత నిర్మాణం కోసం డివైఎఫ్ఐ నిరంతరం పనిచేస్తుందని ఆ దిశగా యువత కలిసి వచ్చి సమ సమాజ స్థాపన కోసం చేయి చేయి కలపాలని పిలుపునిచ్చారు. అంతే కాకుండా నిరంతరం వివిధ సమస్యల డివైఎఫ్ఐ మీద పనిచేస్తుందని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యువకులను క్రీడల వైపు దృష్టి పెట్టడానికి గ్రామాలలో క్రీడా ప్రాంగణాలను అభివృద్ధి చేసి క్రీడా సామాగ్రిని అందుబాటులో ఉంచాలని కోరారు.



ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ మండల కార్యదర్శి పసుపుల ఏడుకొండలు,సిఐటియు మండల కన్వీనర్ కర్నాటి సుధాకర్, రైతు సంఘం మండల అధ్యక్షులు ముసుకు బుచ్చిరెడ్డి, డివైఎఫ్ఐ నాయకులు శ్రావణ్, కిరణ్, తెరటిపెల్లి గ్రామ నాయకులు గిరి వెంకటేష్, నిఖిల్, రాములు, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి

**విద్యాసంస్థల యాజమాన్యాలు రాష్ట్రవ్యాప్తంగా కొనసాగిస్తున్న బంద్‌కు పిడిఎస్‌యూ సంపూర్ణ మద్దతు.**

**కామ్రేడ్ బొల్లుగ్గరి కిరణ్ కుమార్, పి డి ఎస్ యూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు**

నల్లగొండ, నవంబర్ 5 (వార్తా వేదిక సూర్య):
ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పి డి ఎస్ యూ) ఆధ్వర్యంలో ఈరోజు ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ వద్ద ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పి డి ఎస్ యూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ బొల్లుగ్గరి కిరణ్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణలోని గత, ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వంలు గత నాలుగు సంవత్సరాల నుంచి పేద మధ్యతరగతి బడుగు బలహీన వర్గాల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల విద్యార్థుల చదువుల కోసం ఇవ్వవలసిన స్కాలర్షిప్స్, ఫీజు రీఎంబర్స్మెంట్ ఇవ్వకపోవడం వలన విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. విద్యార్థులు పై చదువులు చదువుకోలేక, ఫీజులు కట్టలేక చదువులను అర్ధంతరంగా మధ్యలోనే ఆపివేసే పరిస్థితి వచ్చింది. ఒకవైపు విద్యార్థులు ఫీజులు కట్టలేక మరోవైపు విద్యాసంస్థల యజమాన్యాలు తమకు ఇవ్వవలసిన సర్టిఫికెట్స్ ఇవ్వకపోవడం వలన విద్యార్థులకు యజమాన్యాలకు మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. మరోవైపు విద్యాసంస్థల యాజమాన్యాలు తమకు రావలసిన పెండింగ్ ఫీజు రీఎంబర్స్మెంట్ బకాయిలు రాక అప్పులు చేసి దిక్కుతోచని పరిస్థితులలో ఉన్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితులలో, తప్పనిసరి పరిస్థితులలో విద్యాసంస్థల యాజమానాలు తమకు రావలసిన ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు వచ్చేంతవరకు విద్యాసంస్థలకు బంద్ ను ప్రకటించాయి. ఈ సందర్భంగా డిగ్రీ, పీజీ, బీ.ఈడీ, ఇంజనీరింగ్, ఫార్మసీ, నర్సింగ్, ఎంసీఏ, ఎంబీఏ కళాశాలాలు మూతపడ్డాయి. ఈ న్యాయమైన బందుకు పి డి ఎస్ యూ తెలంగాణ రాష్ట్ర కమిటీ తమ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుంది అన్నారు. ఇకనైనా ప్రభుత్వం కక్షపూరిత ధోరణికి పోకుండా విజిలెన్స్, టాస్క్ ఫోర్స్ దాడులు అంటూ భయభ్రాంతులకు గురిచేయకుండా విద్యార్థుల




జీవితాలను, భవిష్యత్తును ఆలోచించి వెంటనే పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జరిగే విద్యా సంస్థల బందుకు మా సంపూర్ణ మద్దతు ఇవ్వడమే కాకుండా జరిగే పోరాటాల్లో భాగస్వామ్యమై విరామం ఎరుగని పోరాటాలు కొనసాగిస్తామని, రాష్ట్రవ్యాప్త విద్యార్థి పోరాటాలకు రూపకల్పన చేస్తామని, పెండింగ్ ఫిజియంబస్మెంట్ విడుదల అయ్యేంతవరకు దశల వారి కార్యక్రమాలను రూపొందించి పోరాటాల ద్వారానే పెండింగ్ ఫీజు రియంబర్స్మెంట్ సాధిస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో పి డి ఎస్ యూ రాష్ట్ర నాయకులు ఎన్. బాలరాజు, బొల్లుగ్గరి నవీన్ కుమార్, పి డి ఎస్ యూ నాయకులు, ఓ యు వరుణ్, ప్రేమ్, సపన్, అనిరుద్, రాకేష్, రవి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# నాయి బ్రాహ్మణ సంఘ భవన నిర్మాణ పనులకు 3 లక్షలు మంజూరు చేసిన ఇందూరు పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్

కోరుట్ల నవంబర్ 05 ( వార్తా వేదిక సూర్య):
కోరుట్ల పట్టణంలోని ఝాన్సీ రోడ్ లో గల నాయి బ్రాహ్మణ సంఘ భవన నిర్మాణ అభివృద్ధి పనులు ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథి గా జగిత్యాల జిల్లా బిజెపి అధ్యక్షులు డాక్టర్ రాచకొండ యాదగిరి బాబు హాజరై భూమి పూజ చేశారు వారు మాట్లాడుతూ తెలంగాణలో ఏ పార్లమెంటు సెగ్మెంట్ లో లేని అభివృద్ధి పనులు మన ఎంపీ అరవింద్ గారు చేశారని చేస్తూ కూడా ఉన్నారని నిజామాబాద్ పార్లమెంటు అభివృద్ధి లక్ష్యంగా ఆయన ముందుచూపుతో వెళ్తున్నారని గత కొన్ని నెలల క్రితమే కోరుట్ల పట్టణానికి నవోదయ స్కూల్ కూడా వచ్చిందని అన్నారు నిధులు కేటాయించిన ఎంపీ ధర్మపురి అరవింద్ కి సంఘ సభ్యులు బీజేపీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.
ఇట్టి కార్యక్రమంలో కోరుట్ల భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు బింగి వెంకటేష్ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు రుద్ర శ్రీనివాస్ స్టేట్ కౌన్సిల్ మెంబర్ ఎలేటి నరేందర్ రెడ్డి జిల్లా కార్యదర్శి కస్తూరి లక్ష్మీనారాయణ, పట్టణ ప్రధాన



కార్యదర్శి ఎర్ర రాజేందర్, గిన్నెల శ్రీకాంత్ మేకల గణేష్ రాగం శెట్టి సాయి కృష్ణ, పట్టణ నాయి బ్రాహ్మణ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# ఈనెల 8న చండూరులో జరిగే సిఐటియు జనరల్ బాడీ సమావేశాన్ని జయప్రదం చేయాలి

**సిఐటియు చండూరు మండల కన్వీనర్ జెర్రిపోతుల ధనంజయ**

చండూరు, నవంబర్ 5 (వార్తా వేదిక సూర్య):
ఈనెల 8న చండూరు మార్కెట్ యార్డులో జరిగే సీఐటీయూ జనరల్ బాడీ సమావేశాన్ని జయప్రదం చేయాలని సిఐటియు చండూరు మండల కన్వీనర్ జెర్రిపోతుల ధనంజయ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుసరిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపై కార్మిక వర్గం ఐక్యంగా సమరశీల ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. 1970లో ఐక్యత పోరాటం నినాదంతో సిఐటియు ఆవిర్భవించిందని ఆయనతెలిపారు. నాటినుండి నేటి వరకు కార్మిక వర్గాన్ని ఒక వర్గంగా ఐక్యం చేయడం కోసం వారి హక్కుల కోసం అనేక ఉద్యమాలు నిర్వహించి విజయాలు సాధించిందని ఆయన పేర్కొన్నారు.బిజెపి ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్స్ గా మార్చి కార్మిక హక్కులనుకాలరాసిందన్నారు.ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ,దేశంలో సహజ వనరులన్నీ బడా కార్పొరేట్ పెట్టుబడు దారులకు అప్పనంగా అప్పజెప్తోందని ఆయన విమర్శించారు.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు కార్మిక వర్గానికి అనేక హామీలు ఇచ్చిందని అధికారంలోకి రాగానే ఏ ఒక్క హామీ అమలు చేయకుండా కార్మికులను మోసం చేసిందని విమర్శించారు.కార్మిక వర్గ సమస్యల పై చర్చించడానికి ఈనెల 8న చండూరు మండల కేంద్రంలో జరిగే సమావేశానికి మున్సిపల్ కార్మికులు, గ్రామపంచాయతీ కార్మికులు, హమాలి కార్మికులు, ఆశా వర్కర్లు, నల్లగొండ జిల్లా తోపుడు బండ్లు మరియు డబ్బా కోట్ల కార్మికులు, మిషన్ భగీరథ కార్మికులు, వివో ఏలు, అంగన్వాడి టీచర్స్, మధ్యాహ్న భోజన కార్మికులు, రైస్ మిల్ కార్మికులు సకాలంలో హాజరై ఈ జనరల్ బాడీ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

# మోచి సంఘ భవన నిర్మాణ పనులకు మూడు లక్షల రూపాయలు మంజూరు చేసిన ఇందూరు పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్

కోరుట్ల నవంబర్ 05 ( వార్తా వేదిక సూర్య):
కోరుట్ల పట్టణంలోని ఝాన్సీ రోడ్‌లో గల మోచి సంఘ భవన నిర్మాణ అభివృద్ధి పనులు ప్రారంభించడం జరిగింది.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథి గా జగిత్యాల జిల్లా బిజెపి అధ్యక్షులు డాక్టర్ రాచకొండ యాదగిరి బాబు హాజరై భూమి పూజ చేశారు వారు మాట్లాడుతూ తెలంగాణలో ఏ పార్లమెంటు సెగ్మెంట్ లో లేని అభివృద్ధి పనులు మన ఎంపీ అరవింద్ గారు చేశారని చేస్తూ కూడా ఉన్నారని నిజామాబాద్ పార్లమెంటు అభివృద్ధి లక్ష్యంగా ఆయన ముందు చూపుతో వెళ్తున్నారని గత కొన్ని నెలల క్రితమే




కోరుట్ల పట్టణానికి నవోదయ స్కూల్ కూడా వచ్చిందని అన్నారు నిధులు కేటాయించిన ఎంపీ ధర్మపురి అరవింద్ కి సంఘ సభ్యులు బీజేపీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు
ఇట్టి కార్యక్రమంలో కోరుట్ల భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు బింగి వెంకటేష్ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు రుద్ర శ్రీనివాస్ స్టేట్ కౌన్సిల్ మెంబర్ ఎలేటి నరేందర్ రెడ్డి జిల్లా కార్యదర్శి కస్తూరి లక్ష్మీనారాయణ, పట్టణ ప్రధాన కార్యదర్శి ఎర్ర రాజేందర్, గిన్నెల శ్రీకాంత్ మేకల గణేష్ రాగం శెట్టి సాయి కృష్ణ, కొండ్లెపు రాజేంద్రప్రసాద్ పట్టణ మోచి సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# కొమ్ము శేఖర్ మాదిగకు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ అవార్డు



**సూర్యాపేట, నవంబర్ 5(వార్త వేదిక సూర్య):** ఉస్మానియా యూనివర్సిటీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో ప్రొఫెసర్ వై. పార్థసారథి గారి పర్యవేక్షణలో కెపాసిటీ బిల్డింగ్ ఆఫ్ మునిసిపల్ కార్పొరేటర్స్ అండ్ కౌన్సిలర్స్ టువర్డ్స్ అర్బన్ గుడ్ గవర్నెన్స్‌బీ ఎ స్టడీ ఆఫ్ తెలంగాణ స్టేట్" అనే అంశంపై చేసిన విశ్లేషణాత్మక పరిశోధనకు గాను కొమ్ము శేఖర్ మాదిగకు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ అవార్డును మంజూరు చేసింది.

సామాజిక న్యాయ సాధనలో ఎల్లప్పుడూ ముందుండే ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగమార్గనిర్దేశకత్వంలో నడుస్తున్న మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్)లో కీలక నాయకుడిగా ఎదిగిన శేఖర్ ఓయూ అధ్యక్షుడిగా,పలు జిల్లాలకు ఇన్‌చార్జ్‌గా తన సేవలను అందిస్తూ ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

నిజాం కాలేజీలో డిగ్రీ చదువుతున్న కాలంలోనే ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడగా, విద్యార్థి నాయకుడిగా పోరాటాలలో ముందువరుసలో నిలబడి తన కృషితో అందరి దృష్టిని ఆకర్షించారు. అనంతరం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీలో పీజీ పూర్తి చేసిన శేఖర్ ఒకవైపు సామాజిక న్యాయ ఉద్యమంలో కొనసాగుతూనే, మరోవైపు ఉన్నతవిద్యలో ప్రగతిని ఆపకుండా పీహెచ్‌డీ ప్రవేశం పొంది పరిశోధనలో ప్రతిభ చాటారు.

డాక్టరేట్ బిరుదు అందుకున్న అనంతరం తనకు స్ఫూర్తిగా నిలిచిన పద్మశ్రీ మందకృష్ణ మాదిగను వారి నివాసంలో ప్రత్యేకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేసి ఆశీర్వాదం తీసుకున్నారు. పరిశోధన అవాంతరం లేకుండా పూర్తిచేయడానికి ఎంతో చొరవ తీసుకొని సహకరించిన తన గురువర్యులు ప్రొఫెసర్ వై.పార్థసారథితో పాటు పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలోని అధ్యాపకులు, సిబ్బంది అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

చిన్నతనంలో కూలీ పనులు చేస్తూ మరోవైపు సామాజిక న్యాయం, సమానత్వ సాధన కోసం జరిగిన దండోరా ఉద్యమంలో నిబద్ధతతో పని చేస్తూనే, విద్యను ఆయుధంగా మార్చుకొని ఉన్నత లక్ష్యాలను చేరుకున్న కొమ్ము శేఖర్ మాదిగకు ఉస్మానియా యూనివర్సిటీ అధ్యాపకవర్గం, విద్యార్థి సంఘాల నేతలు, ఎమ్మార్పీఎస్ మరియు అనుబంధ సంఘాల నాయకులు,కార్యకర్తలు అభినందనలు తెలియజేశారు.





# యాదగిరిగుట్ట దేవస్థాన వ్యవస్థను ప్రక్షాళన చేయాలి

## మాజీ ఎంపీ, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ బూర నర్సయ్య గౌడ్

**చౌటుప్పల్, నవంబర్ 5(వార్త వేదిక సూర్య):** అవినీతిలో కూరుకుపోయిన యాదగిరిగుట్ట దేవస్థాన వ్యవస్థను ప్రక్షాళన చేయాలని మాజీ ఎంపీ, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూర నర్సయ్య గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం యాదగిరిగుట్టలో భారీగా ర్యాలీ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ దేవాలయ పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు. యాదాద్రి ఆలయంలో ఇటీవల బయటపడుతున్న అవినీతి అక్రమ వ్యవహారాలు భక్తుల హృదయాలను కలిచి వేస్తున్నాయని, ఆలయాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించవద్దని అన్నారు. అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న వారిపై దేవాదాయశాఖ కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. పవిత్ర ఆలయాల పరిరక్షణ కోసం అందరూ కృషి చేయాలని, రాజకీయ ఉద్యమం



కాదని, ప్రజల విశ్వాసాన్ని రక్షించుకునే ధర్మ యుద్ధమని తెలిపారు. భక్తి ధర్మం కోసం జరిగే పోరాటంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఉత్కూరి అశోక్



గౌడ్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు రాజేందర్ రెడ్డి, GS అచ్చయ్యా, గుట్ట మున్సిపల్ ప్రెసిడెంట్ ప్రవీణ్,మంగు నరసింహ రావు, డి ఎల్ ఎన్,రాజు తదితరులు పాల్గొన్నారు.



గాంధీ పార్క్‌లో నిరుపయోగంగా ఉన్న వాటర్ ఫిల్టర్ ప్లాంట్

# ఉత్సవ విగ్రహాలుగా మారిన వాటర్ ప్లాంట్లు

## వినియోగంలోకి తేవాలని కోరుతున్న ప్రజలు

చౌటుప్పల్, నవంబర్ 5(వార్త వేదిక సూర్య): చౌటుప్పల్ మున్సిపాలిటీ లోని దివిస్ సౌజన్యంతో ఫిల్టర్ వాటర్ ప్రజలకు తక్కువ ధరకు అందించాలనే ఉద్దేశంతో గతంలో చౌటుప్పల్‌లో కేంద్రాలు ను ఇప్పుడు ఎవరు పట్టించుకునే నాధుడే కరువయ్యారు. దివిస్ పరిశ్రమ యాజమాన్యం లక్షల రూపాయలు పెట్టి వాటర్ ఫిల్టర్ కేంద్రాలు ఏర్పాటు చేశారు అవి ఇప్పుడు



విశ్వకర్మ కాలనీలో నిరుపయోగంగా ఉన్న వాటర్ ఫిల్టర్ ప్లాంట్

కొన్ని వాటర్ ప్లాంట్ లు ఏర్పాటు చేసి చౌటుప్పల్ మున్సిపాలిటీకి అప్పగించారు. కొన్ని రోజులు ప్రజలకు ఫిల్టర్ నీరు అందుబాటులోకి తెచ్చి నీరు అందించారు. ఈ వాటర్ ఫిల్టర్ కేంద్రాలు గత సంవత్సరం నుండి ప్రజలకు అందుబాటులో లేకుండా నిరుపయోగంగా మారిపోయాయి. ఈ ఉత్సవ విగ్రహాలుగా మారిపోయాయి ఇప్పటికైనా వాటర్ ఫిల్టర్ కేంద్రాలు సంబంధిత అధికారులు పట్టించుకోని అందుబాటులోకి తీసుకువచ్చి ప్రజలకు ఫిల్టర్ వాటర్ అందించే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు నాయకులు కోరుతున్నారు.



శివాజీ నగర్‌లో నిరుపయోగంగా ఉన్న వాటర్ ఫిల్టర్ ప్లాంటు





# కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులతో శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయం కిటకిట

**చౌటుప్పల్, నవంబర్ 5(వార్త వేదిక సూర్య):** కార్తీక పౌర్ణమి సందర్భంగా శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో బుధవారం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి దీపాలు వెలిగించారు కార్తీకమాసం చివరి రోజు కావడంతో భక్తులతో దేవాలయం కిటకిటలాడింది. ఉదయం నుండి సాయంత్రం వరకు కూడా భక్తుల తాకిడి ఉంది భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్తీకమాస దీపాలు వెలిగించే తమ తమ మొక్కులను తీర్చుకొని ప్రత్యేక పూజలు చేశారు. దీంతో చిన్న కొండూరు రోడ్ దేవాలయం వద్ద కొంతవరకు ట్రాఫిక్ ఏర్పడింది. దీంతో పోలీసులు ట్రాఫిక్ ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకొని వారదారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు.

రాత్రి వరకు దేవాలయం భక్తులతో కిటకిటలాడింది.





www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

# సమష్టి ప్రదర్శనతోనే చిరస్మరణీయ విజయం

### మహిళల విజయంపై ఐసీసీ ఛైర్మన్ జై షా



మహిళల వన్డే ప్రపంచకప్ 2025లో టీమిండియా విజేతగా నిలిచింది. అద్వితీయమైన ప్రదర్శనతో అర్ధశతాబ్దపు కలను సాకారం చేసుకుంది. 2005, 2017 ఫైనల్లో తృటిలో టైటిల్ చేజారగా.. ఈసారి మాత్రం భారత మహిళల జట్టు ఏ తప్పు చేయలేదు. ఒత్తిడిని చిరునవ్వుతో ఛేదిస్తూ తొలిసారి ఫైనల్ చేరిన సౌతాఫ్రికాను మట్టికరిపించింది. 1983 ప్రపంచకప్‌లో కపిల్ సేన సాధించిన విజయం భారత క్రికెట్ గతిని మార్చినట్టే.. హర్మన్ సేన సాధించిన తాజా విజయం మహిళల క్రికెట్‌ను మరో మెట్టెక్కించనుంది. ఫైనల్లో షెఫాలీ వర్మ, దీప్తి శర్మ ఆల్‌రౌండ్ షోతో పాటు అమన్‌జోత్ కౌర్ మ్యాచ్ విన్నింగ్ క్యాచ్ టీమిండియాకు చిరస్మరణీయ విజయాన్నందించాయి. తెలుగు తేజం శ్రీచరణి టోర్నీ ఆసాంతం అద్భుత ప్రదర్శన కనబర్చగా.. ఓపెనర్లు స్మృతి మంధాన, ప్రతీకా రావల్‌తో బ్యాట్‌తో సత్తా చాటారు. ఈ విజయం నేపథ్యంలో భారత మహిళా క్రికెటర్లపై సర్వత్రా ప్రశంసల జల్లు కురుస్తోంది. తాజాగా భారత మహిళల విజయంపై స్పందించిన ఐసీసీ ఛైర్మన్ జై షా.. సమష్టి ప్రదర్శనతోనే ఈ చిరస్మరణీయ విజయం దక్కిందని చెప్పాడు. 'నాకు మహిళల క్రికెట్ అంటే చాలా ఇష్టం. భారత మహిళల జట్టు ఐసీసీ ట్రోఫీని నెగ్గడం సంతోషంగా ఉంది. ఇలాంటి విజయం, మహిళల క్రికెట్ అభివృద్ధి కావడం వంటి పరిణామాలన్నీ మన కళ్ల ముందే కార్యరూపం దాల్చాయి. అందుకోసం ప్రత్యక్షంగా, తెర వెనుక పనిచేస్తోన్న కష్టానికి ఇదే నిదర్శనం.'అని జైషా పేర్కొన్నాడు.



# తిరిగి టీంలోకి రిషబ్ పంత్

### దక్షిణాఫ్రికాతో టెస్ట్ జట్టు ప్రకటన

దక్షిణాఫ్రికాతో జరిగే టెస్ట్ సిరీస్ కోసం టీమ్ ఇండియాను ప్రకటించింది. రిషబ్ పంత్ తిరిగి జట్టుకు వైస్ కెప్టెన్‌గా వచ్చాడు. 2025-27 ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ సైకిల్‌లో భారత్ ఆడుతున్న మూడో టెస్ట్ సిరీస్ ఇది. బుధవారం నాడు ప్రెస్ రిలీజ్ విడుదల చేస్తూ బీసీసీఐ జట్టును ప్రకటించింది. నేషనల్ టీమ్‌తో పాటు, బోర్డు దక్షిణాఫ్రికా 'ఎ'తో 3 వన్డే మ్యాచ్‌ల సిరీస్ కోసం ఇండియా 'ఎ' జట్టును కూడా ప్రకటించింది. దీనికి తిలక్ వర్మ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. ఇంగ్లాండ్ పర్యటనలో నాల్గో టెస్ట్‌లో పంత్‌కు గాయమైంది, ఇందులో అతని కాలి వేలికి ఫ్రాక్చర్ అయింది. ఆ తర్వాత అతను ఆసియా కప్, వెస్టిండీస్‌తో జరిగిన టెస్ట్ సిరీస్ ఆస్ట్రేలియా పర్యటనలకు దూరమయ్యాడు. 100 రోజులకు పైగా తర్వాత అతను తిరిగి వచ్చాడు.ఆకాష్ దీప్ కూడా జట్టులోకి తిరిగి వచ్చాడు. పంత్ రాకతో ఎన్ జగదీశన్ జట్టు నుంచి బయటకు వెళ్లవలసి వచ్చింది. ఫాస్ట్ బౌలర్ ప్రసిద్ధ్ కృష్ణ స్థానంలో ఆకాష్ దీప్ వచ్చాడు.

### దక్షిణాఫ్రికాతో జరిగే టెస్ట్ కోసం భారత్ జట్టు

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రిషబ్ పంత్ (వికెట్ కీపర్, వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, కెఎల్ రాహుల్, సాయి సుదర్శన్, దేవదత్ పడిక్కల్, ధ్రువ్ జురెల్, రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్, జస్ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్, నితీష్ కుమార్ రెడ్డి, మహ్మద్ సిరాజ్, కుల్దీప్ యాదవ్, ఆకాష్ దీప్.

# ఎందుకు పక్కన పెట్టామో.. అర్ష్‌దీప్ సింగ్‌కు అర్థమైంది

### టీమిండియా బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్

ఆస్ట్రేలియాతో తొలి రెండు టీ20లకు అర్ష్‌దీప్ సింగ్‌ను ఎందుకు పక్కనపెట్టామో అతనికి అర్థమైందని టీమిండియా బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ తెలిపాడు. టీ20 ప్రపంచకప్ 2026 కాంబినేషన్ కోసం ప్రయోగాలు చేస్తున్నామని, ఈ క్రమంలోనే అతనికి అవకాశం దక్కలేదని వివరణ ఇచ్చాడు. ఈ విషయాన్ని అర్ష్‌దీప్ సింగ్ అర్థం చేసుకున్నాడని చెప్పాడు. మూడో టీ20లో రీఎంట్రీ ఇచ్చిన అర్ష్‌దీప్ సింగ్ మూడు వికెట్లతో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. గురువారం గోల్డ్ కోస్ట్ వేదికగా నాలుగో టీ20 జరగనున్న నేపథ్యంలో మోర్నీ మోర్కెల్ బుధవారం మీడియాతో మాట్లాడాడు. ఈ సందర్భంగా అర్ష్‌దీప్ సింగ్‌ను పక్కనపెట్టడంపై క్లారిటీ ఇచ్చాడు. 'అర్ష్‌దీప్ సింగ్ చాలా అనుభవం కలిగిన బౌలర్. మా ప్రయోగాల గురించి అతను పూర్తిగా అర్థం చేసుకున్నాడు. అతను ఒక ప్రపంచ స్థాయి బౌలర్. పవర్ ప్లేలో అత్యధిక వికెట్లు తీసే బౌలర్. జట్టుకు అతని విలువ ఏంటో మాకు తెలుసు. అయితే ఈ పర్యటనలో మేం వివిధ కాంబినేషన్లను ప్రయత్నించాం. జట్టు ఎంపిక టీమ్‌మేనేజ్‌మెంట్‌తో పాటు ఆటగాళ్లకు సవాలే. టీ20 ప్రపంచకప్ 2026 ముంగిట విభిన్నమైన కాంబినేషన్స్‌ను ప్రయత్నించాలనుకుంటున్నాం. దీంతో ఆటగాళ్లు తమకు అవకాశం రాలేదని నిరాశకు గురవ్వడం సహజమే. కానీ, మేనేజ్‌మెంట్ మరోలా ఆలోచిస్తుంది. ఆటగాళ్లను ఇంకా శ్రమించేలా ప్రోత్సహిస్తాం. ఎప్పుడూ అవకాశం వచ్చినా అత్యుత్తమ ఆటతీరు కనబర్చేలా సన్నద్ధం చేస్తాం. వచ్చే పొట్టి కప్‌లోగా చాలా తక్కువ మ్యాచ్‌లనే ఆడాల్సి ఉంటుంది. ఒత్తిడి సమయాల్లో ఆటగాళ్లు ఎలా రాణిస్తారనేది పరీక్షించాం. వారి సత్తాపై మాకు ఎలాంటి సందేహం లేదు. మ్యాచ్‌లను ఎలా గెలవాలనే దానిపైనే వర్కౌట్ చేస్తున్నాం.'అని మోర్నీ మోర్కెల్ వెల్లడించాడు. నితీష్ కుమార్ రెడ్డి గాయం నుంచి పూర్తిగా కోలుకున్నాడని, నాలుగో టీ20లో బరిలోకి దిగుతాడని మోర్కెల్ తెలిపాడు.



# హర్మన్‌ప్రీత్‌కు అరుదైన గౌరవం

వరల్డ్‌కప్ విన్నింగ్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌కు అరుదైన గౌరవం దక్కనుంది. జైపూర్ వ్యాక్స్ మ్యూజియంలో ఆమె మైనపు విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఇటీవల భారత మహిళల జట్టుకు వన్డే వరల్డ్‌కప్ అందించిన తొలి కెప్టెన్‌గా హర్మన్ చరిత్రలోకెక్కింది. దీంతో ఆమె గౌరవార్థం ఈ విగ్రహం ఏర్పాటు చేయనున్నట్లు జైపూర్ వ్యాక్స్ మ్యూజియం వ్యవస్థాపకులు అనూప్ శ్రీవాస్తవ తెలిపారు. టీమ్‌ఇండియా వరల్డ్‌కప్ విజయానికి ఈ విగ్రహాన్ని అంకితం ఇవ్వనున్నట్లు శ్రీవాస్తవ పేర్కొన్నారు. 'భారత మహిళల క్రికెట్ జట్టుకు వరల్డ్‌కప్ అందించిన కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ మైనపు విగ్రహాన్ని జైపూర్ వ్యాక్స్ మ్యూజియంలో ఏర్పాటు చేయనున్నాం. ఈ విగ్రహాన్ని మహిళల ప్రపంచకప్ విజయానికి అంకితం ఇస్తాం. ఆమె క్రికెట్‌కు సేవలు అందించడమే కాదు, ఈ గెలుపుతో మహిళా సాధికారతకు తోడ్పడింది.

మేం ప్రముఖ వ్యక్తులను మాత్రమే కాదు, హర్మన్‌లా భవిష్యత్ తరానికి స్ఫూర్తినిచ్చే వాళ్ల విగ్రహాలు కూడా పెడతాం. అంతర్జాతీయ మహిళా దినోత్సవం నాడు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఈ విగ్రహాన్ని ఆవిష్కరిస్తుంది' అని శ్రీవాస్తవ తెలిపారు. దీంతో జైపూర్‌లోని నహర్‌గఢ్ కోటలో ఉన్న ఈ మ్యూజియంతో మార్చి 8, 2026న అంతర్జాతీయ మహిళా దినోత్సవం నాడు హర్మన్ మైనపు విగ్రహం ఆవిష్కరించనున్నారు. కాగా, ఈ మ్యూజియంలో ఇప్పటికే ఎంఎస్ ధోని, సచిన్ తెందుల్కర్, విరాట్ కోహ్లీ వంటి దిగ్గజ క్రికెటర్ల మైనపు విగ్రహాలు ఉన్నాయి. తాజా విగ్రహంతో, ప్రపంచ కప్ విజేతలు ధోనీ, హర్మన్ ఇద్దరు కెప్టెన్ల విగ్రహాలు ఉండనున్నాయి. వీటితోపాటు ఇదే మ్యూజియం కల్పనా చావ్లా, సైనా నెహ్వాల్, మదర్ థెరిసా, రాజమాత గాయత్రి దేవి, హాది రాణి వంటి మహిళా విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఇక ఈ లిస్ట్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ చేరనుంది. 2025 వరల్డ్‌కప్ ఫైనల్‌లో సౌతాఫ్రికాపై భారత్ 52 పరుగుల తేడాతో నెగ్గి ఛాంపియన్‌గా నిలిచింది. 52ఏళ్ల వరల్డ్‌కప్ హిస్టరీలో భారత్ ట్రోఫీని అందుకోవడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ వరల్డ్‌కప్ టోర్నమెంట్‌లో హర్మన్ తన కెప్టెన్సీ స్కిల్స్‌తో ఆకట్టుకుంది. ప్రత్యర్థుల అంచనాలకు అందని వ్యూహాలతో దెబ్బ తీసింది. ఫైనల్‌లో షెఫాలీ వర్మ బౌలింగ్ అందుకు నిదర్శనం. ఈ విషయాన్ని సౌతాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్ట్ కూడా మ్యాచ్ అనంతరం అంగీకరించింది. ఇలాంటి వ్యూహాలతో హర్మన్ తనదైన మార్క్ చూపించి భారత్‌ను ఛాంపియన్‌గా నిలపడంలో తనవంతు పాత్ర పోషించింది. ఇక భారత్‌కు (పురుషుల, మహిళల) వన్డే వరల్డ్‌కప్ అందించిన మూడో కెప్టెన్‌గా హర్మన్ రికార్డు సాధించింది. ఇప్పటికే పురుషుల జట్టు రెండుసార్లు (1983 కపిల్ దేవ్, 2011 మహేంద్రసింగ్ ధోనీ) విజేతగా నిలవగా, తాజాగా మహిళల జట్టును హర్మన్ విజేతగా నిలిపింది.




# హారిస్ రౌఫ్ మూల్యాన్ని చెల్లించుకున్నాడు

సెప్టెంబర్ లో జరిగిన ఆసియా కప్ సమయంలో క్రికెట్ ప్రతిష్టకు భంగం కలిగించినందుకు ఐసీసీ చర్యలు చేపట్టింది. భారత టి20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, పాకిస్తాన్ ఫాస్ట్ బౌలర్ హారిస్ రౌఫ్ లపై ఐసీసీ చర్యలు తీసుకుంది. ఆసియా కప్ టోర్నమెంట్ సమయంలో 4 డీమెరిట్ పాయింట్లు రావడంతో హారిస్ రౌఫ్‌ను 2 వన్డే మ్యాచ్‌ల నుండి సస్పెండ్ చేసినట్లు ప్రకటించింది. పాక్ పేసర్ రౌఫ్ కు భారత్ తో జరిగిన 2 వేర్వేరు ఘటనలకుగాను 30-30 శాతం జరిమానా విధించారు. దీనితో పాటు దక్షిణాఫ్రికాతో మంగళవారం ప్రారంభమైన వన్డే సిరీస్ లో 2 మ్యాచ్ ల నుండి హారిస్ రౌఫ్‌ను నిషేధించారు. నవంబర్ 6న జరిగే రెండో మ్యాచ్ లో కూడా అతను ఆడేందుకు అవకాశం లేదు. హారిస్ రౌఫ్ కు ఈ 2 ఘటనలకు గాను నాలుగు డీమెరిట్ పాయింట్లు వచ్చాయి. వీటిని ఐసీసీ నిబంధనల ప్రకారం 2 సస్పెన్షన్ పాయింట్లుగా మార్చింది. భారత టీ20 కెప్టెన్ సూర్యకుమార్ పై మ్యాచ్ ఫీజులో 30 శాతం జరిమానా విధించింది ఐసీసీ. సూర్య సైతం క్రీడల ప్రతిష్టకు భంగం కలిగించినట్లు భావించింది. భారత కెప్టెన్ పహల్గామ్ ఉగ్రదాడి బాధితులకు సంఘీభావం తెలుపుతూ భారత సాయుధ దళాలకు మద్దతు ఇచ్చాడు. జస్ప్రీత్ బుమ్రాపై కూడా ఒక డీమెరిట్ పాయింట్ విధించారు. ఎందుకంటే పాక్‌తో జరిగిన ఫైనల్లో రౌఫ్ ను ఔట్ చేసిన తర్వాత అతను 'విమానం కూలిపోయింది' అని సైగ చేశాడు. సూర్యకుమార్ చేసిన వ్యాఖ్యలపై 30 శాతం జరిమానా విధించింది. ఈ వార్తను మొదట సెప్టెంబర్ 26న పిటిఐ రిపోర్ట్ చేసింది. సెప్టెంబర్ 14న జరిగిన మ్యాచ్ లో విమానం కూలిపోవడాన్ని సూచించే అభ్యంతరకరమైన సంజ్ఞలు చేసినందుకు హారిస్ రౌఫ్ తప్పు చేసినట్లు ఐసీసీ తేల్చింది. రౌఫ్ ఆపరేషన్ సింధూర్ లో భారత సైనిక చర్యను ఎగతాళి చేశాడు. ఈ ఘర్షణలో 6 భారత యుద్ధ విమానాలను కూల్చివేసినట్లు పాకిస్తాన్ చేసిన వాదనకు మద్దతు తెలిపాడు. సెప్టెంబర్ 28న బౌండరీ లైన్ వద్ద ఫీల్డింగ్ చేస్తున్నప్పుడు భారత అభిమానులను రెచ్చగొట్టడానికి ప్రయత్నిస్తూ, రౌఫ్ అదే సంజ్ఞను మరోసారి చేశాడు. పాకిస్తాన్ బ్యాటర్ సాహిబ్జాదా ఫర్హాన్ కు కూడా ఒక డీమెరిట్ పాయింట్ ఇచ్చారు. భారత ఫాస్ట్ బౌలర్ అర్షదీప్ సింగ్ ను ఎలాంటి జరిమానా లేదా డీమెరిట్ పాయింట్ విధించలేదు. ఫర్హాన్ భారత్ పై హాఫ్ సెంచరీ చేసిన తర్వాత బ్యాట్ తో తుపాకీని కాల్చినట్లు సంజ్ఞ చేస్తూ సంబరాలు చేసుకున్నాడు. సెప్టెంబర్




14, 2025న 'సూర్యకుమార్ యాదవ్ (భారత్) ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని నిబంధన 2.21 ను ఉల్లంఘించాడు. ఇది క్రీడల ప్రతిష్టకు భంగం కలిగించే ప్రవర్తనకు సంబంధించినది. సూర్య మ్యాచ్ ఫీజులో 30 శాతం జరిమానా విధిస్తున్నాం. 2 డీమెరిట్ పాయింట్లు ఇస్తున్నామని' ఐసీసీ ఒక ప్రకటనలో పేర్కొంది. దీని ప్రకారం 'సాహిబ్జాదా ఫర్హాన్ (పాకిస్తాన్) కూడా ఇదే తప్పిదానికి పాల్పడినట్లు తేలింది. అతనికి ఒక డీమెరిట్ పాయింట్ విధించాం' అని పేర్కొంది. 'హారిస్ రౌఫ్ (పాకిస్తాన్) కూడా ఇదే తప్పిదానికి పాల్పడినట్లు తేలింది. రౌఫ్ మ్యాచ్ ఫీజులో 30 శాతం జరిమానా విధించాం. ఫలితంగా అతనికి 2 డీమెరిట్ పాయింట్లు వచ్చాయని' ఐసీసీ పేర్కొంది. అర్షదీప్ విషయం సోషల్ మీడియా క్లిప్ నకు సంబంధించినది. అతను పాకిస్తాన్ అభిమానులను ఎగతాళి చేస్తూ కనిపించాడు. అయితే ఐసీసీ మ్యాచ్ రిఫరీకి ఇది అభ్యంతరకరంగా అనిపించలేదు. సెప్టెంబర్ 21న భారత్, పాకిస్తాన్ సూపర్ 4 మ్యాచ్ కు సంబంధించినది. సెప్టెంబర్ 28న జరిగిన ఫైనల్ లో చేసిన చర్యలకు విధించిన ఆంక్షలపై ఐసీసీ ఇలా స్పందించింది. 'జస్ప్రీత్ బుమ్రా (భారత్) క్రీడల ప్రతిష్టకు భంగం కలిగించే ప్రవర్తనకు సంబంధించిన నిబంధన 2.21 కింద మోపబడిన ఆరోపణను, ప్రతిపాదిత అధికారిక హెచ్చరికను అంగీకరించాడు. ఫలితంగా అతనికి ఒక డీమెరిట్ పాయింట్ విధించాం' అని తెలిపింది. మునుపటి విచారణ సమయంలో తనను తాను నిర్దోషిగా చెప్పుకున్న రౌఫ్, భారత ప్రేక్షకులకు మళ్లీ అభ్యంతరకరమైన సంజ్ఞలు చేస్తూ కనిపించాడు.

'ఐసీసీ మ్యాచ్ రిఫరీ రిచీ రిచర్డ్సన్ నిర్వహించిన విచారణ తర్వాత హారిస్ రౌఫ్ (పాకిస్తాన్) మళ్లీ నిబంధన 2.21 ను ఉల్లంఘించాడని తేలింది. అతనికి మ్యాచ్ ఫీజులో 30 శాతం జరిమానా విధించగంతో పాటు 2 అదనపు డీమెరిట్ పాయింట్లు వచ్చాయని' తెలిపింది.

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY



# పెద్దిలో చికిరి చికిరి స్టెప్పులు

రామ్ చరణ్ బుచ్చిబాబు సానా కాంబోలో వస్తున్న పెద్ది సినిమాపై ప్రపంచ వ్యాప్తంగా భారీ అంచనాలు ఉన్న విషయం తెలిసిందే. జాన్వీ కథానాయిక కాగా ఆస్కార్ విన్నర్ రెహామాన్ సంగీతం అందిస్తున్నాడు. అయితే.. ఈ సినిమా నుంచి అప్డేట్ ఎప్పుడు వస్తుందా అని మెగా అభిమానులు వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే వచ్చిన ఫస్ట్ షాట్ వీడియో ప్రపంచ వ్యాప్తంగా తెగ వైరల్ అయింది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శర వేగంగా జరుగుతుండగా ఇటీవలే శ్రీలంకలో ఓ పాట సైతం చిత్రీకరణ పూర్తి చేసుకుని టీం తిరిగి వచ్చింది. వచ్చే మార్చిలో ఈ మూవీ ప్రేక్షకులకు ఎదుటకు రానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ ఈ చిత్రం నుంచి ఒక్కొక్కటిగా అప్డేట్ ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. తాజాగా ఈ సినిమా నుంచి పాట రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించిన డైరెక్టర్ బుచ్చి బాబు సానా పాటకు సంబంధించి బుధవారం చిన్న గ్లిమ్స్ రిలీజ్ చేసి నవంబర్ 7, శుక్రవారం రోజున పూర్తి పాటను విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఇందుకోసం బుచ్చిబాబు ఏకంగా ఈ సినిమా సంగీత దర్శకుడు రెహామాన్ నే రంగంలోకి దింపాడు. ఆయనతో తన ఫస్ట్ ఇంటరాక్షన్ గురించి వివరించి చివరకు ఈ సినిమా సాంగ్ సిట్యూవేషన్ చెప్పి ఓ ట్యూన్ అడగడం అయన

వెంటనే చికిరి చికిరి అంటూ ఓ ట్యూన్ ఇవ్వడం అంతా చకచకా జరిగిపోయినట్లు చూపించారు. చివర్లో పాట ట్యూన్‌కు తగ్గట్టు రామ్‌చరణ్ వేసిన స్టెప్స్ ను సైతం చూపించి ఒక్క సారిగా పాటపై హైప్ పెంచేశారు.

ఈ వీడియో బయటకు వచ్చిన క్షణాల్లోనే రామ్ చరణ్ హుక్ స్టెప్ సోషల్ మీడియాను కమ్మేసింది. రామ్ చరణ్ , మెగా అభిమానులే కాక చాలామంది నెటిజన్లు సైతం ఈ వీడియోకు, ఆ స్టెప్పులకు ఫిదా అవుతున్నారు. రానున్న నెలరోజులు ఈ పాట ఇంటర్నెట్‌ను షేక్ చేస్తుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఎక్కడ చూసినా రామ్ చరణ్ స్టెప్పులే దర్శణమివడం గ్యారంటీ.



## బోర్డర్-2 నుంచి వరుణ్ ధావన్ లుక్ విడుదల

వరుస సినిమాలతో సూపర్ హిట్లు అందుకున్న బాలీవుడ్ నటుడు సన్నీడియోల్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం బోర్డర్ 2. ఈ సినిమాకు సినిమాకు అనురాగ్‌సింగ్ దర్శకత్వం వహించనుండగా.. భూషణ్‌కుమార్, కృష్ణన్ కుమార్, జేపీదత్తా, నిధిదత్తా కలిసి నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో వరుణ్ ధావన్, దిలిజిత్ దోసాంజే, అహాన్ శెట్టి, సోనమ్ బజ్వా తదితరులు కీలక పాత్రల్లో నటించబోతున్నారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం వచ్చే ఏడాది జనవరి 22న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అయితే ఈ మూవీ నుంచి చిత్రబృందం తాజాగా వరుణ్ ధావన్ ఫస్ట్ లుక్‌ని విడుదల చేసింది. వరుణ్ ధావన్ ఇందులో హోషియర్ సింగ్ దాహియా అనే పాత్రలో కనిపించబోతుండగా ఈ ఫస్ట్ లుక్‌లో వరుణ్ ధావన్ గన్ పట్టుకుని శత్రువులను కాల్చుతున్నట్లు కనిపిస్తుంది.



## అనగనగా ఒక రాజులో పాట పాడిన నవీన్

మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి సినిమా తర్వాత జాతి రత్నాలు ఫేం నవీన్ పొలిశెట్టి నటిస్తోన్న చిత్రం అనగనగా ఒక రాజు. ఈ మూవీ నుంచి ఇప్పటికే లాంచ్ చేసిన ప్రీ వెడ్డింగ్ వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. ఈ సినిమాను జనవరి 14న సంక్రాంతి కానుకగా విడుదల చేయనున్నారు. మ్యాడ్ ఫేం కళ్యాణ్ శంకర్ ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేయాల్సి ఉండగా.. మారి చేతుల్లోకి వెళ్లింది. ఈ సినిమా కోసం నవీన్ పొలిశెట్టి సింగర్‌గా మారిపోయాడన్న వార్త మూవీ లవర్స్‌లో క్యూరియాసిటీ పెంచేస్తుంది. తాజా సమాచారం ప్రకారం నవీన్ పొలిశెట్టి పాడిన ఈ పాట నవంబర్ మూడో వారంలో లాంచ్ కానుంది. ఇప్పటిదాకా విడుదల చేసిన ప్రమోషనల్ కంటెంట్ కామిక్ టచ్‌తో సాగుతూ సినిమాపై అంచనాలు పెంచేస్తుంది. ఇప్పటికే లాంచ్ చేసిన పోస్టర్‌లో నవీన్ పొలిశెట్టి లుంగీ, బనియన్ వేసుకుని, మెడలో రుమాలు వేసుకొని రాయల్ ఎన్‌ఫీల్డ్ బైకుపై వెళ్తూ క్యూరియానిటీ పెంచుతున్నాడు. సితార ఎంటర్‌టైన్ మెంట్స్ నిర్మిస్తున్న ఈ మూవీలో ఈ చిత్రంలో మీనాక్షిచౌదరి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో వస్తోన్న ఈ చిత్రాన్ని ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ కో ప్రొడ్యూస్ చేస్తుంది. ఈ చిత్రానికి మిక్కీ జే మేయర్ మ్యూజిక్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నాడు. రాజుగారి పెళ్లి విందులో చమ్మక్ చంద్ర అరేయ్ ఇది రాజుగారి పెళ్లి.. గెస్టులందరికీ గోల్డ్ ప్లేట్స్ మాత్రమే పెట్టండి.. అంటూ చెప్పే డైలాగ్స్‌తో మొదలైంది ప్రీ వెడ్డింగ్ వీడియో. అతిథుల్లో ఓ వ్యక్తి ఏంటండి వీళ్లు ప్లేటు గోల్డ్.. స్వీటు గోల్డ్ అంటున్నారు.. ఇదేమైనా మలబార్ గోల్డ్ వాళ్ల పెళ్లా అని అడుగుతుంటే.. మరో వ్యక్తి ఏవండి ఇది మా రాజుగారి పెళ్లండి అని అంటున్నాడు. నవీన్ పొలిశెట్టి ముఖేశ్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీ వెడ్డింగ్ క్యాసెట్ చూస్తూ.. ముఖేశ్ అంబానీకి ఫోన్ చేసి.. ముఖేశ్ మామయ్యా ఈవెంట్‌కు వచ్చిన సెలబ్రిటీల ఫోన్ నంబర్లు పెట్టు చెబుతా.. ఈ ఇయర్ అంతా అంబానీ పెళ్లి.. వచ్చే ఏడాదంతా రాజుగారి పెళ్లి అంటున్నాడు. జాతి రత్నాలు హీరో స్టైల్ ఆఫ్ హ్యూమర్ టచ్‌తో సాగుతున్న వీడియో సినిమాపై హైప్ క్రియేట్ చేస్తోంది.

## గర్ల్‌ఫ్రెండ్ మూవీ సంతృప్తిని ఇచ్చే సినిమా

**- నిర్మాత అల్లు అరవింద్**

రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో, రష్మిక మందన్నా ప్రధాన పాత్రలో రూపొందిన 'ది గర్ల్‌ఫ్రెండ్' ఈనెల 7న విడుదల కానుంది. అల్లు అరవింద్ గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై వస్తున్న ఈ చిత్రం ట్రైలర్ నుంచి మంచి హైప్ క్రియేట్ చేయడంతో సినిమాపై ప్రేక్షకులలో భారీ అంచనాలు ఉన్నాయి. సినిమా విడుదలకు మరో రెండు రోజుల సమయం మాత్రమే ఉన్న నేపథ్యంలో తాజాగా బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా.. అల్లు అరవింద్ మాట్లాడుతూ.. పలు ఆసక్తికర అంశాలు పంచుకున్నారు. నేను చాలా సినిమాలు తీశాను, డబ్బులు సంపాదించాను. కానీ 'ది గర్ల్‌ఫ్రెండ్' మాత్రం తృప్తికోసం తీశాను అంటూ వ్యాఖ్యానించారు.



2021లో ఈ కథ విన్నప్పటి నుంచి సినిమా తీయాలని ఎదురుచూశాను. సమాజానికి బోల్డ్‌గా కొన్ని విషయాలు చెప్పాలనిపించింది. అందుకే ఈ సినిమా చేశాము. ఇది చాలా సున్నితమైన సబ్జెక్ట్. ప్రతి యువకుడు, యువతి తప్పకుండా చూడాల్సిన సినిమా ఇదని అన్నారు. ఇందులో ఎన్ని పాటలు ఉన్నాయి, ఎన్ని ÷టింగ్‌లు ఉన్నాయి, ఏం పంచ్‌లు ఉన్నాయనేది ఈ సినిమాకు వర్తించదని, 'మన ఇంట్లో ఆడవాళ్ల మనస్సుల్లో ఏమి కోరికలు, భావోద్వేగాలు ఉంటాయో ఈ సినిమా చూపిస్తుంది. కథ అతి సున్నితంగా మొదలై, అతి ఘాటుగా ముగుస్తుంది. చూసిన వారు ఈ సినిమాను మర్చిపోలేరు? ఈ కథ వెంటాడుతుంది. 'ది గర్ల్‌ఫ్రెండ్' కి తక్కువ రేటింగ్ ఇవ్వలేరు అంత సంతృప్తికరంగా ఉంటుంది సినిమా అని స్పష్టం చేశారు. ప్రస్తుతం అల్లు అరవింద్ కూడా ముందుకు వచ్చి చెప్పిన ఈ మాటలు ఇప్పుడు సినిమాపై మరింత బజ్ తీసుకొచ్చేలా ఉన్నాయి. ఇదిలా ఉంటే.. ఓ విలేఖరి ఇటీవల బండ్ల గణెళిష్ చేసిన కామెంట్స్ గురించి మాట్లాడాలి అని అడగగా.. నేను ఆయన గురించి మాట్లాడను నాకంటూ ఓ స్థాయి ఉంది అంటూ కౌంటర్ ఇచ్చారు.



## మగాళ్లకు కూడా వస్తే.. బాధ తెలుస్తుంది

### టీవీ షోలో రష్మిక మందన్న సంచలన కామెంట్స్

ఈ ఏడాది ఇండియన్ సినీ పరిశ్రమలో రష్మిక మందన్నా సందడి ఎక్కువగా కనిపిస్తోంది. నెల, రెండు నెలల గ్యాప్‌లో ఓ సినిమా విడుదల చేస్తూ ప్రేక్షకులను అలరిస్తోంది. ఇప్పటివరకు ఆమె నటించిన నాలుగు సినిమాలు థియేటర్లలో విడుదలై మంచి విజయాన్ని సాధించాయి. గత ఏడాది డిసెంబర్‌లో విడుదలైన 'పుష్ప 2' తో రష్మిక తన సత్తా చాటుకోగా, ఈ ఏడాది 'ఛావా', 'సికందర్', 'కుబేర', 'థామా' చిత్రాలతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇప్పుడు రష్మిక నటించిన తాజా చిత్రం 'ది గర్ల్ ఫ్రెండ్' ఈ నెల 7న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో రష్మిక పలు ప్రమోషనల్ కార్యక్రమాల్లో బిజీగా ఉంది. షోలు, ఇంటర్వ్యూలలో పాల్గొంటూ అభిమానులను అలరిస్తోంది. తాజాగా ఆమె జగపతిబాబు హోస్ట్‌గా రన్ అవుతున్న 'జయమ్ము నిశ్చయమ్మురా' టాక్ షోలో పాల్గొని సందడి చేసింది. ఈ సందర్భంగా రష్మిక తన చిన్ననాటి అనుభవాలను పంచుకుంటూ, స్కూల్ రోజుల్లో జరిగిన ఒక సంఘటనను గుర్తుచేసింది. జగపతిబాబు అడిగిన ప్రశ్నలకు రష్మిక ఇచ్చిన సరదా సమాధానాలు ప్రేక్షకులను అలరించాయి. అంతేకాకుండా, షోలో రష్మిక మహిళలకు సంబంధించిన సమస్యలపై మాట్లాడింది. 'మగాళ్లకు కూడా పీరియడ్స్ వస్తే బాగుండని అనిపించింది. ఆ సమయంలో మహిళలు ఎదుర్కొనే నొప్పి, బాధ ఎలా ఉంటుందో అబ్బాయిలు కూడా అనుభవిస్తే వారికి అర్థం అవుతుందని చెప్పి అందర్నీ ఆకట్టుకుంది. ఆమె మాటలకు జగపతిబాబు, ఆడియెన్స్ ఇద్దరూ చప్పట్లు కొట్టారు. ఇక రష్మిక నటించిన 'ది గర్ల్ ఫ్రెండ్' ఒక ఇంటెన్స్ లవ్ స్టోరీగా తెరకెక్కింది. దీక్షిత్ శెట్టి హీరోగా నటించిన ఈ చిత్రానికి రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహించగా, ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మాతలుగా వ్యవహరించారు. గీతా ఆర్ట్స్ సమర్పణలో రూపొందిన ఈ చిత్రంలో ప్రేమకథలోని కొత్త కోణాన్ని చూపించబోతున్నట్లు దర్శకుడు తెలిపారు. ఈ సినిమా చూసిన తర్వాత అమ్మాయిలు తమ లవర్స్ గురించి ఆలోచించేలా ఉంటుందని ఆయన చెప్పడం విశేషం. ప్రస్తుతం రష్మిక మందన్నా 'మైసా' అనే లేడీ ఓరియెంటెడ్ మూవీలో నటిస్తోంది. అదనంగా బాలీవుడ్‌లో ఒక కొత్త ప్రాజెక్ట్‌లోనూ భాగమవుతోంది. అంతేకాకుండా విజయ్ దేవరకొండతో కలిసి రాహుల్ సాంక్రిత్యాన్ దర్శకత్వంలో నటిస్తోంది. పలు క్రేజీ ప్రాజెక్టులపై చర్చలు కొనసాగుతున్నాయని సినీ వర్గాల సమాచారం.




### మోహన్ లాల్ తనయుడు ప్రణవ్ లాల్ మూవీ డీయస్ ఈరే

మలయాళ స్టార్ నటుడు మోహన్‌లాల్ కొడుకు ప్రణవ్ లాల్ చాలా రోజుల తర్వాత నటిస్తున్న తాజా చిత్రం 'డీయస్ ఈరే'. ఈ సినిమాకు బ్రహ్మయుగం దర్శకుడు రాహుల్ సదశివన్ దర్శకత్వం వహించగా మలయాళంలో ఈ చిత్రం అక్టోబర్ 31న ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి విజయాన్ని అందుకుంది. ఇప్పుడు ఇదే చిత్రం తెలుగులో నవంబర్ 07న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా తెలుగు ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. మిస్టరీ థ్రిల్లర్‌గా ఈ చిత్రం రాబోతుంది.

Printed, Published and Owned by **POLOJU SRINIVASA CHARY**,and **Printed at SURYA DIGITAL PRINTERS,** H.No.132, Markondeya Nagar, Choutuppal Municipality, YadadriBhuvanagiri District, Telangana State508252., and Published at H.No. 132, Markondeya Nagar, Choutuppal Municipality, YadadriBhuvanagiri District, Telangana State508252. **Editor: POLOJU SRINIVASA CHARY. RNI No: TGTEL/25/A0305,** Cell:9985389183. **Email Id:vaarthavedhikasurya2025@gmail.com**